

శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం బుధవారం ఉదయానికి తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపలకు చేరాయి. ప్రభాతవార్త ప్రతినిధి, తిరుమల


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త


## కార్మికుల సంక్షేమమే ప్రధాన అజెండా

### – కేంద్ర కార్మికశాఖ మంత్రి




రేణిగుంట, ఆగస్టు 24 ప్రభాతవార్త:

కార్మికుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన అజెండాగా పెట్టుకున్నామని కేంద్ర, కార్మిక, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు. గురు, శుక్రవారాల్లో తిరుపతిలో జరిగే జాతీయ కార్మిక సదస్సులో పాల్గొనడానికి ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ బుధవారం రేణిగుంటకు చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్ తదితరులతో పాటు పలువురు అధికార అనధికార ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయం పోర్టుకోలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందన్నారు. అనంతరం ఆయన రోడ్డు

# అకాల వర్షం-అన్నదాతకు కష్టం

## నేలవాలిన వరిపంట



.శేషమనాయుడుకండ్రిగ సమీపంలో నేలవాలిన వరిపంట

తొట్టంబేడు, ఆగస్టు 24 ప్రభాతవార్త

అకాలవర్షంతో అన్నదాతకు కష్టం కలిగింది. ఎన్నడూ లేని విధంగా కోతకు వచ్చేదశలో ఈఏడాది పంట బాగా వచ్చిందన్న సంతోషంతో రానున్న వినాయకచవితి పండుగను సంబరాలుగా చేసుకుంటామన్న దశలో వరుణుడు తన ప్రతాపాన్ని చూపాడు. కోతకు వచ్చిన పంట ఇక చేతికి వస్తుందనుకుంటున్న గత మూడు రోజుల నుంచి ఎండవేడిమి ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. ఈతరుణంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నేలవాలింది. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, వ్యవసాయాధికారులు మాత్రం అన్నదాతలకు నష్టం ఏమి లేదని పేర్కొంటున్నారు. తూర్పు మండలాలైన శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం, కెవిబిపురం మండలాల్లో ఓమోస్తారు వర్షపాతం నమోదైంది. శ్రీకాళహస్తి పట్టణంలో ఉదయం 5గంటల నుంచే వర్షం పడగా గ్రామాల్లోమాత్రం వర్షపాతం అత్యధికంగా నమోదైంది. ఈనేపద్యంలో బుధవారం వర్షపాతం నమోదైన వివరాలను పరిశీలిస్తే బుచ్చినాయుడుకండ్రిగలో 35.4మి.మీ, ఏర్పేడు 34.0మి.మీ, శ్రీకాళహస్తిలో 27.2మి.మీ, తొట్టంబేడులో 24.6మి.మీ, కెవిబిపురంలో 3.0మిమీ వర్షపాతం నమోదైంది. ఇక బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో ఇప్పటికే సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా నమోదైంది. మండలంలోని కొత్తకండ్రిగ, పూడి, శేషమనాయుడుకండ్రిగ, పెద్దకనపర్తి, కొత్తకండ్రిగ(పికె) గ్రామాల్లో అన్నదాతలు వేసిన వరి పంట కోతదశకు వచ్చింది. మరో రెండు రోజుల్లో కోతలు కోయాల్సి ఉండగా వర్షం అన్నదాతలను కుదేలు చేసింది. పెద్దకనపర్తి మార్గంలో ఎక్కడ చూసినా వరిపంట నేలవాలిన దృశ్యాలు కనిపిస్తాయి. దీంతో అన్నదాతలు వేలరూపాయలు పెట్టుబడులు పెట్టిన పంట చేతికి వస్తుందా?లేదా? అన్న మీమాంసలో ఉన్నారు. కోతలు కోయాల్సి ఉండగా వర్షం పడడంతో కోతలు కూడా ఆగిపోయాయి. తొట్టంబేడు మండలంలో ఎక్కువగా 1010లు, 1638, ఎడిటి-37, ఎన్‌ఎల్‌ఆర్-3 రకాలు పండిస్తున్నారు. ఇక కోతలు పూర్తయిన పంటకు మాత్రం తడవకుండా పట్టలు కప్పి ఉంచడం కనిపిస్తోంది.

# కుప్పం అభివృద్ధి తెదేపాతోనే...

**ప్రజలకు అండగా ఉంటా - ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు**

**-కార్యకర్తల ధైర్యమే తెదేపాకు శ్రీరామరక్ష.. రౌడీల పాలన మరలా రానీయను!!**

**- సిఎం జగన్‌రెడ్డి పులివెందుల పులా.. పిల్లా అనేది తెలుతుంది !!**



కొల్లుపల్లి రోడ్‌షోలో ప్రసంగిస్తున్న చంద్రబాబు ,



మహిళలతో మాట్లాడుతున్న చంద్రబాబు

కుప్పం/రామకుప్పం/కుప్పంరూరల్/గుడుపల్లె, ఆగస్టు 24 ప్రభాతవార్త

కుప్పం అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే జరిగిందని, తాను ప్రజలకు అన్ని విధాగా అండగా ఉంటానని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. బుధవారం కొల్లుపల్లి, జరిగిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. 2004నుంచి కుప్పంలో అభివృద్ధి ఆపేశారన్నారు. 2014లో మరలా అధికారంలో వచ్చాక కుప్పంలో అభివృద్ధి పరుగులు పెట్టించానన్నారు. గ్రామ గ్రామాన సిసి రోడ్లు, పాఠశాలలు, మరుగుదొడ్లు, నీటి ట్యాంకులు నిర్మించామన్నారు. వంటగ్యాస్ అందరికీ అందించామన్నారు. విద్యకు చాలా ప్రాధాన్యత ఇచ్చామన్నారు. కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి శ్రీరామరక్ష అన్నారు. సిఎం జగన్‌రెడ్డి పోలీసులను పావులుగా వాడుకుంటున్నారన్నారు. మరలా రౌడీల పాలన రానీయన్నారు. సిఎం జగన్‌రెడ్డి పులివెందుల పులా పిల్లా అనేది తెలుతుందన్నారు. నలభై ఏళ్లుగా కుప్పం ప్రశాంతతకు మారుపేరని మాకు పోలీస్‌స్టేషన్లు వద్దన్న కుప్పంలో ఓ ఐదుపదిమందిని తమపై ఉసిగొల్పుతున్నారన్నారు. మీకు ఉండేది రౌడీయిజం అని తనకు ఉన్నది విలువలతో కూడిన రాజకీయ విశ్వసనీయత అన్నారు. వైకాపా రౌడీయిజం చూసి తాను హైదరాబాదులో ఉండిపోవాలా, కుప్పం నుంచి పారిపోవాలా అని ప్రశ్నించారు. వైకాపా వద్ద అవినీతి కట్టలు కట్టలు ఉన్నాయన్నారు. 2004కంటే ముందు వారిది లక్షల్లో ఆదాయం నేడు లక్షల కోట్లలో ఆదాయం అన్నారు. ఓ ఎంపి బట్టలు విప్పేసి తిరిగాడని ఇలా చేయవచ్చా అని ప్రశ్నించారు. అతన్ని సిఎం జగన్‌రెడ్డి పిలిచి రాజీనామా చేయించాల్సి ఉందన్నారు. రాజకీయం వేరు, అభివృద్ధి వేరు అని తాను ఆలోచించానన్నారు. పంచాయతీ ఎన్నికల్లో నాలుగు చోట్ల గెలిచాం అని పుంగనూరు పుడింగి ఇక్కడ హడావుడి చేస్తున్నారన్నారు. తాను పులివెందులను కుప్పంలా అభివృద్ధి చేద్దామనుకుంటే సిఎం జగన్‌రెడ్డి కుప్పాన్ని పులివెందుల చేయాలనుకుంటున్నారన్నారు. ఒకరిద్దరు రౌడీయిజం చేస్తే టిడిపి భయపడేది లేదన్నారు. వైకాపా 175 సీట్లు గెలవడం కాదు ఈసారి పులివెందులలో సైతం ఓడిపోతారన్నారు. నాయకుడంటే ప్రజలకు గౌరవం తెచ్చేలా ఉండాలని సిఎం జగన్‌రెడ్డి పులివెందులలో చెడబుట్టారని విమర్శించారు. కార్యక్రమాల్లో మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర నేతలు గోపీనాథ్, గాజుల ఖాదర్ బాషా, నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతిలో ప్రముఖుల సందడి!

## అటు జాతీయ కార్మిక సదస్సు ఇటు టిటిడి నోడల్ గోశాలల సదస్సు

ప్రభాతవార్త-తిరుపతి:

యాత్రాస్థలం,స్మార్ట్‌సిటీ తిరుపతి నగరం సాధారణంగానే ప్రతిరోజూ విచ్చేస్తున్న లక్షమంది యాత్రికులు, ప్రముఖులతో సందడిగా ఉంటుంది. ఇక్కడ యాత్రికులు రద్దీ పెరిగితే లాడ్జీల్లో, హోటళ్లలో గదులు కూడా దొరకని సమస్య ఎదురవుతోంది. అలాంటిది ఏకంగా రేపు, ఎల్లుండి గురు,శుక్రవారాల్లో రెండురోజులు పాటు దేశంలోని రాష్ట్రాల నుంచి కార్మికశాఖ మంత్రులు, విభాగాధిపతులు, ఉన్నతాధికారులతోబాటు శాఖా కార్యదర్శులు తదితర వారు దాదాపు రెండువందలమంది వరకు ప్రముఖులు విచ్చేస్తుండటంతో మరింత సందడిగా మారనుంది. తిరుపతిజిల్లాలో తొలిసారిగా జాతీయ కార్మిక సదస్సుకు ఆతిథ్యం ఇచ్చి తిరుచానూరు బైపాస్‌లోని హోటల్ తాజ్ వేదిక కానుండటంతో అధికారగణం ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఇదే సమయంలో టిటిడి అధికారులు 25,26తేదీల్లో తిరుపతిలోని శ్వేత భవనంలో జరగనున్న ఈ శిక్షణలో రాష్ట్రంలోని 300మంది గోశాలల నిర్వాహకులకు, ఔత్సాహిక ప్రకృతి వ్యవసాయ రైతులకు నోడల్ గోశాలల నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ రెండు కార్యక్రమాలకు బుధవారం రాత్రికి తిరుపతికి చేరుకున్న ప్రముఖులతో తిరుపతి నగరం గురు. శుక్రవారాలు మరింతసందడిగా మారనుంది. అలాగే తిరుమలకు చేరుకుని దేవదేవుని దర్శనం చేసుకోనున్నారు. తిరుపతి జిల్లాలో తొలిసారిగా ఎంతో ప్రతిష్టాత్మకంగా జాతీయ కార్మికసదస్సు నిర్వహిస్తుండటంతో జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జిల్లా ఎస్పి పి.పరమేశ్వరరెడ్డి, జిల్లా యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు, భద్రత చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే తిరుమలకు చేరుకునే ప్రముఖులను దృష్టిలో వుంచుకుని బసచేసే పద్మావతి అతిధిగృహాల ప్రాంతం, ఘాట్‌రోడ్లను నిశితంగా ప్రత్యేక పోలీసు బలగాలు జల్లెడపడుతున్నారు.

## తాజ్ హోటల్ పరిసర ప్రాంతాల్లో పోలీస్ భద్రత కట్టుదిట్టం

### - 2వేల మందితో భారీ బందోబస్తు : - ఎస్పీ పరమేశ్వరరెడ్డి




తిరుపతి క్రైం, ఆగష్టు 24 ప్రభాతవార్త ః

జాతీయ స్థాయిలో వివిధ కార్మిక సమస్యలపై చర్చించడానికి దేశ వ్యాప్తంగా ఉన్న కార్మిక మంత్రులు, రాష్ట్రాలు, యూటీల కార్మిక కార్యదర్శులు జాతీయ కార్మిక సదస్సుకు గురువారం తిరుపతి తాజ్ హోటల్‌కు రానున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి సంబంధిత జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. హోటల్ పరిసర ప్రాంతాల్లో గట్టి పోలీస్ బందోబస్తు చేపట్టారు. ఎస్పీ మాట్లాడుతూ దాదాపు రెండు వేల మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వామ పక్ష పార్టీలు ఈ జాతీయ స్థాయి సమావేశాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరగనున్న నేపథ్యంలో సదస్సుకు హాజరయ్యే వీవీఐపీ, వీఐపీలకు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగిందని, అలాగే గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు అడ్మిన్ సుప్రజ, లా అండ్ ఆర్డర్ కులశేఖర్, ఎస్‌బీడీఎస్‌పీ రమణ, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఆర్.ఐలు, ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పర్యటన

### -రీ సర్వే,ఇంటి నిర్మాణ పనుల పరిశీలన



పలమనేరు,ఆగస్టు 24,ప్రభాతవార్త:

పలమనేరు మండలంలో జిల్లా కలెక్టర్ హరినారాయణన్ క్షేత్ర స్థాయిలో బుధవారం పర్యటన చేపట్టారు.మండలంలోని మొరంలో జరుగుతున్న రీ సర్వే పనులను పరిశీలించిన ఆయన అక్కడి రైతులతో సమీక్షించారు.టి.వడ్డూరులోని సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు.సచివాలయంలో వాలంటీర్ల హాజరు శాతం తక్కువగా ఉందని వారంలో 3రోజులు తప్పని సరిగా వాలంటీర్లు బయోమెట్రిక్ హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ విద్యాసాగర్‌కు సూచించారు.ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వే ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతుందన్నారు.భూ వివాదాలు పరిష్కరించేందుకు సమగ్ర సర్వే చేసే రీ సర్వే కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.పేదవారి సొంతంటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు-పేదలందరికీ ఇంటి నిర్మాణ కార్యక్రమం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు చేయడం జరుగుతుందన్నారు.మొరం గ్రామం రామాపురంలో నక్కపల్లె చెరువు మీద వంతెన నిర్మించాలని రైతులు కలెక్టర్‌ను కోరగా పరిశీలిస్తామని రైతులకు హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కుప్పుస్వామి,ఎంపిడిఓ విద్యాసాగర్,మండల సర్వేయర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మింట్ నుంచి.. రూ.6.3కోట్లతో

# వెయ్యి కిలోల వెండి కొనుగోలు



శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న రాహుకేతుదోష నివారణ పూజల్లో నాగపడగల కొరతను అధిగమించటానికి వెయ్యి కిలోల వెండిని బుధవారం హైదరాబాదులోని ప్రభుత్వ మింట్‌నుంచి కొనుగోలు చేసారు. రూ.6.3కోట్లతో వెండిని హైదరాబాదులోని ప్రభుత్వ మింట్‌లో కొనుగోలు చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మార్చి 1న బాధ్యతలు స్వీకరించింది. అలాగే ఆలయానికి కొత్త ఇఓ గా తిరుపతి హథీరాంజీ మఠం బాధ్యతలను పర్యవేక్షిస్తున్న ఆర్‌జెసి ఇఓగా నియమించారు. వారు బాధ్యతలు చేపట్టిన తరువాత రాహుకేతుదోష నివారణ పూజలకు సంబంధించి నాగపడగల కొరత ఏర్పడింది.దాంతో ఇఓ, ధర్మకర్తల మండలి చైర్మెన్ నాగపడగల కొరతకు సంబంధించి సమగ్ర పరిశీలన జరిపిన తరువాత తమ వద్ద ఉన్న 1600 కిలోల వెండితో నాగపడగల తయారి కష్టంగా ఉందని గుర్తించారు.గతంలో ఆలయం వద్ద ఉన్న 16 టన్నుల వెండిని మింట్‌ద్వారా విక్రయించారు. ప్రస్తుతం కొరత ఏర్పడటంతో కొనుగోలు చేయాల్సి వచ్చింది.

**12 మందితో కమిటి:**

శ్రీకాళహస్తీశ్వరాలయం వెండి కొనుగోలుకు సంబంధించి దేవస్థానం ప్రతిపాదనలు పంపినపుడు దేవాదాయశాఖ కమిషనర్ కమిటిని 12 మందితో ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి ఏడుగురు దేవాదాయశాఖ ప్రధాన కార్యలయం నుంచి మరో ఐదు మందితో కమిటి నియమించారు. వీరు బుధవారం హైదరాబాదులో ప్రభుత్వ మింట్‌కు వెళ్ళారు. వెళ్ళిన వారిలో ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఇఓ వికె సాగర్‌బాబు, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఆలయ అర్చకుల నుంచి కరుణాకర్‌గురుకుల్, శ్రీకాళహస్తీశ్వర గురుకుల్ (రవి),అకౌంటెంట్ యుగంధర్, బాలాజి ప్రదాన కార్యాలయం నుంచి ఆర్‌విడి మరి నలుగురు కలసి వెండి కొనుగోలు చేసారు.ఈ వెండిని గురువారం హైదరాబాదు నుంచి తీసుకొని శ్రీకాళహస్తి రానున్నారు.

## అభివృద్ధి పనులపై దృష్టి !

### -త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలి : ఇఓ



తిరుమల,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమల,తిరుపతిలో టిటిడి ఆధ్వర్యంలో జరుగుతున్న పలు అభివృద్ధిపనులు త్వరగా పూర్తిచేయాలని టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయ గోపురం బంగారుతాపడం పనులు, తిరుమలలో వెంగమాంబ బృందావనం నిర్మాణం, శేషాచలంలో సంప్రదాయ మొక్కల పెంపకం వంటి పనులు సకాలంలో చేయాలన్నారు. బుధవారం ఉదయం ఇఓ ఏవి ధర్మారెడ్డి, టిటిడి జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహకిశోర్, ఎఫ్ఎసిఎఓ బాలాజీ, సిఇ నాగేశ్వరరావు,ఇంజనీరింగ్, అటవీశాఖ సిబ్బందితో కలసి సమీక్షించారు.

## సొంతింటిపై జెండా కట్టుకుంటే రాళ్ల దాడులు చేస్తారా - ఎమ్మెల్సీ భరత్

కుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త

ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పర్యటనలో భాగంగా కొల్లుపల్లి గ్రామంలో తన సొంత ఇంటిపై వైకాపా జెండా కట్టుకుంటే అలాంటి వారిపై తెదేపా శ్రేణులు దాడులు చేయడం దారుణమని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పేర్కొన్నారు. పోలీసులపై సైతం దాడులకు దిగడం దారుణమన్నారు.చంద్రబాబు నాయుడు చచ్చిపోయిన కేడర్‌ను బ్రతికించాలనే ఇలా చేస్తున్నారన్నారు. వైకాపా కార్యకర్తలపై రాళ్ల దాడి జరగడంతో కార్యకర్తలతో పాటు సిఐ, ఎస్సైలకు గాయాలయ్యాయన్నారు. కుప్పం ఎంతో ప్రశాంతమైందని ఇక్కడ ఇలా చేయడం దారుణమన్నారు.

## పాఠశాల భవన నిర్మాణానికి మంత్రి భూమి పూజ



పుత్తూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త :

నగరి రూరల్ మండలం కృష్ణ రామాపురంలో నూతన పాఠశాల భవన నిర్మాణానికి బుధవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజల చిరకాల కోరిక మేరకు రూ. 26.00 లక్షలతో పాఠశాల భవనం, రూ. 16.00 లక్షలతో రెండు అదనపు తరగతి గదులు మొత్తం రూ. 42.00 లక్షలతో నిర్మాణాలు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆమె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి లబ్దిదారులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, లేవా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి వైస్ ఎంపిపి, సర్పంచ్‌లు పలువురు ప్రజా ప్రతినిధులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

### ఉష్ణోగ్రతలు
24/8/2022



- తిరుపతి 30 డిగ్రీలు
- చిత్తూరు 32 డిగ్రీలు
- మదనపల్లి 26 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 32 డిగ్రీలు
- వెంకటగిరి 31 డిగ్రీలు
- గూడూరు 32 డిగ్రీలు

### బంగారం ధరలు
24/8/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,805

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,242

### కోడిగ్రుడ్ల ధరలు
24/8/2022



కోడిగ్రుడ్డు :రూ.5.00

1 డజను: రూ.60.00

# కార్యకర్తలను ఆదుకోవడానికి ముందుంటాం | ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

రొంపిచెర్ల ఆగస్టు 24 ప్రభాతవార్త



పుంగనూరు నియోజక వర్గంలో తమ కుటుంబాన్ని ఆదరిస్తున్న ప్రతి ఒక్కరితో పాటు వైకాపా కార్యకర్తలను ఆదుకోవడానికి తాము ఎల్లప్పుడు ముందుంటాంఅని తంబళ్లపల్లెఎమ్మెల్యేపెద్దిరెడ్డిద్వారక నాథరెడ్డి అన్నారు.బుధవారంబొమ్మయ్యగారిపల్లె పంచాయతీ నర్సర్‌పేటలో అనారోగ్యంతోమృతిచెందిన వైకాపా నాయకులు విశ్వనాథం కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూకష్టాల్లోఉన్నకార్యకర్తలకుతమప్రాణాలను అడ్డువేస్తామన్నారు. చంద్రబాబునాయుడు రొంపిచెర్ల మండలానికి చేసింది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి,సింగిల్‌విండో అధ్యఓఉడు హరినాథరెడ్డి, ఎంపీటీసీలు విజయశేఖర్, నూలురెడ్డెప్ప, సర్పంచిలు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, ప్రసాద్‌నాయుడు,వైకాపానాయకులుకోటావెంకటరమణ, విజయ భాస్కరరెడ్డి, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఉన్నతికే నవరత్నాలు

- ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



బంగారుపాళ్యం, ఆగస్టు 24 ప్రభాతవార్త:
పేదలు ఉన్నత స్థాయికి ఎదగడం కోసం ప్రభుత్వం నవరత్నాలు తీసుకువచ్చిందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పేర్కొన్నారు. బుధవారం గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంను కెఎం కండ్రిగ, లక్ష్మీపురం, నాగాల ఇండ్లు గ్రామాల్లో చేపట్టారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పరంగా లబ్ది పొందుతున్న అర్హుల జాబితాను కుటుంబ సభ్యులకు ఆయనే స్వయంగా వివరించారు. ప్రతి ఒక కుటుంబానికి లబ్ది చేకూర్చేవిధంగా నవరత్నాలను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందజేస్తున్నారన్నారు. ప్రజల నుండి వచ్చే సమస్యలను రోజు వారీగా సచివాలయంలోనే పరిష్కరించాలని ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పి.రామచంద్రారెడ్డి, ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపిపిలు శిరీష్‌రెడ్డి, జయకుమార్, ఎంపిడిఓ గౌస్‌భాషా, తహసిల్దారు బెన్నురాజ్, సర్పంచ్ ప్రవల్లిక, ఉప సర్పంచ్ కుట్టి, వైకాపా నాయకులు కృష్ణమూర్తి, ప్రసాద్, కిషోర్‌కుమార్‌రెడ్డి, మహేంద్ర, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## సాయి లింగేశ్వరునికి రుద్రాభిషేకం

చిత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:
పట్టణంలో గిరింపేట నందు వెలసిన శ్రీ సత్యసాయి సేవా సమితిలో మాస శివరాత్రిని పురస్కరించుకొని ఈనెల 26వ తేది శుక్రవారం సాయి లింగేశ్వరునికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు శ్రావణమాసం చివరి శుక్రవారం వరలక్ష్మీవ్రతంను మహిళా సభ్యులచే మందిరంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## గణిత ఉపాధ్యాయులకు శిక్షణ

చిత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:
నగరంలోని బియస్ కన్నన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని గణిత ఉపాధ్యాయులకు గణితంలో క్రియాశీలక బోధన, ప్రతిస్పందనలు అనే అంశంపై ఈనెల 26వ తేది శుక్రవారం శిక్షణ కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు మ్యాథ్స్ ఫోరమ్ కన్వీనర్ హెచ్. అరుణశివప్రసాద్ తెలిపారు.

## పక్కాగా పారిశుధ్యం పనులు

- కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశం

చిత్తూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త:
నగర పరిధిలో పారిశుధ్య పనులను పక్కాగా చేపట్టి పూర్తి చేయాలని కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశించారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ బుధవారం మసీదుమిట్ట, నగర పాలక వాహనాల షెడ్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా కమిషనర్ పారిశుధ్య కార్మికుల హాజరు పట్టిని పరిశీలించారు. కొంతమంది పారిశుధ్య కార్మికుల హాజరును ఆమె స్వయంగా ఎఫ్ఆర్ఎస్ విధానంలో నమోదు చేశారు. పారిశుధ్య కార్మికుల హాజరు నమోదు సమయంలో ఇద్దరు కార్యదర్శులు గైర్హాజరు కావడంపై కమీషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సంక్షేమ పథకాల అమలులో దేశానికే మన రాష్ట్రం ఆదర్శం

-ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ



పెద్దపంజాణి,ఆగస్టు 24,ప్రభాతవార్త:
సంక్షేమ పథకాల అమలులో దేశానికే మన రాష్ట్రం ఆదర్శమని పలమనేరు ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ తెలిపారు.మండలంలోగడపగడపకుఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా రాయలపేట పంచాయితీలోని గుడ్లంవారిపల్లె,గంకొండ,కమ్మపాల్యం, చిలకపుత్తూరు, వడ్డిపల్లె, చాటువారిపల్లె గ్రామాలలో ఆయన పర్యటించారు.నాడు-నేడులో భాగంగా రూ.32లక్షలతో నిర్మించిన రాయలపేట పిహెచ్‌సిను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు.ప్రతి నిరుపేదకు ప్రభుత్వ సంక్షేమం అందించేలా కృషి చేస్తున్నామని దేశంలోనే సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రం ఆదర్శమని తెలిపారు. ప్రతి గ్రామంలోని సమస్యలను నేరుగా తెలుసుకుని ఓ ప్రణాళిక ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నామనితెలిపారు. ఈకార్యక్రమంలోమార్కెట్‌కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి,ఎంపిపి రెడ్డెప్ప,జెడ్పీటీసి సుష్మాకీర్తి, మండల కన్వీనర్ బాగారెడ్డి,సింగాల్‌విండో చైర్మన్ శంకరప్ప,వైకాపా జిల్లా ప్రచార కార్యదర్శి తమ్మిరెడ్డి,వైకాపా నాయకులు సుహేబ్,ప్రసాద్‌రెడ్డి, రాజారెడ్డి,రహంతుల్లా, డా.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## నారా లోకేష్‌ను కలిసిన భీమినేటి చిట్టిబాబు



పాలసముద్రం, ఆగస్టు 24 ప్రభాతవార్త:
జిడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం కో-ఆర్డినేటర్ భీమినేని చిట్టిబాబు బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిశారు. ఈ సందర్బంగా భీమినేని చిట్టిబాబు జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా భీమినేని చిట్టిబాబు జిడినెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో తెలుగుదేశం పార్టీ పటిష్టంకు చేపడుతున్న చర్యలను వివరించారు. జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జిడి నెల్లూరు నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేసి రానున్న ఎన్నికల్లో విజయం సాధించే దిశగా పక్కాగా వ్యూహాలు రచించి ముందుకు వెళ్ళిలని కోరారు. జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసిన వారిలో పెనుమూరు మండల పార్టీ అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, భీమినేని ప్రాజెక్ట్స్ ట్రాన్స్ పోర్ట్ మేనేజర్ వినేష్‌బాబు, పాలసముద్రం రవి తదితరులు వున్నారు.

## మనోశక్తిపై ఆత్మజ్ఞాన బోధన

చిత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:
కాణిపాకం సమీపం సిద్ధంపల్లెలో వెలసిన శ్రీ విఘ్నేశ్వరా మహాపిరమిడ్ శక్తి క్షేత్రం నందు విజయవాడకు చెందిన సీనియర్‌పిరమిడ్ మాస్టర్ కె.వి.స్వామి ఆధ్వర్యంలో ఈనెల 28వ తేది మనోశక్తిపై ఆత్మజ్ఞాన బోధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చిత్తూరు జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.బి. గోపాలక్రిష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆత్మజ్ఞాన సదస్సులో ధ్యానులందరూ పాల్గొని ఆత్మజ్ఞానాన్ని పొంది సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

# రేషన్ బియ్యం తూకంలో తేడాలు



గుడిపాల, ఆగస్టు 24 ప్రభాతవార్త:
రేషన్ షాపులకు అందిస్తున్న బియ్యం తూకంలో తేడాలు వుంటాయని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తహసిల్దారు కార్యాలయంలో బుధవారం తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్ మండల పరిధిలోని రేషన్ డీలర్లతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్లు మాట్లాడుతూ ఎఫ్‌సి గోడౌన్ నుండి రేషన్ షాపులకు వస్తున్న బియ్యం బస్తాల్లో తూకంలో భారీ తేడా వుంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో తాము బియ్యంను వినియోగదారులకు ఎలా పంపిణీ చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన తహసిల్దారు డీలర్లు గోడౌన్‌కు వెళ్ళి బియ్యంను తూకం వేసి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో తహసిల్దారు మాట్లాడుతూ రేషన్ డీలర్లు సకాలంలో డిడిలు చెల్లించాలని కోరారు. పిఎం గరీబ్ కళ్యాణ్ యోజన కింద వచ్చిన బియ్యంను రేషన్ డీలర్లు మాత్రమే వినియోగదారులకు అందించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యుటీ తహసిల్దారు కళ్యాణి, ఆర్ఐ వంశీ, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రాజకీయ సంచలనం గువ్వల రామకృష్ణారెడ్డి



చౌడేపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త
మాజీ టిటిపి అధ్యక్షుడు దివంగత గువ్వల రామకృష్ణారెడ్డి రాజకీయా ల్లో సంచలనాలు సృష్టించారని ఆపార్టీ నాయకులన్నారు. బుధవారం ఆయన వర్థంతిని పురష్కరించుకొని స్థానిక బస్టాండునందుగువ్వలచిత్రపటాన్ని వుంచి నివాళుల ర్పించారు. జడ్పీటీసీ సభ్యుడుగా, బోయకొండ ఛేర్మన్‌గా రామకృష్ణారెడ్డి చేసిన సేవలను గుర్తు చేసారు. మండల తెలుగుయువత హరీష్‌రాయల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. టిడిపి నాయకులు మహేష్, ప్రభాకర్, నాగరాజరెడ్డి, బోయకొండ రమణ, మునివెంకటప్ప, తదితరులు పాల్గొన్నారు.

## మరపురాని స్నేహశీలి మునివెంకటప్ప



చౌడేపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త
మరపురాని స్నేహశీలి మాజీ ప్రభుత్వ కార్యదర్శి, ఐఎస్ మునివెంకటప్పనిపలువురుకొనియాడారు.దివంగత ఐఎస్ అధికారి మునివెంకటప్ప 8వ వర్థంతిని పురష్కరించు కొని లద్దిగం వద్దగల స్మృతివనంలో ఆయన కుటుంబ సభ్యుల మద్య ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా మునివెంకటప్ప ఈ ప్రాంత ప్రజలకు చేసిన సేవలుమరచిపోరన్నారు.దివంగత మునివెంకటప్ప సతీమణి యల్లమ్మ, కుమార్తె హేమమునివెంకటప్ప, ఐఎఫ్ఎస్ గౌతమి, అంబేద్కర్ భవన నిర్మాణకర్త బ్యాంకు రెడ్డెప్ప, కూరపర్తి నారాయణ, మునస్వామి, కూరపర్తి శ్రీనివాసులు, తదితరులు నివాళులర్పించిన వారిలో వున్నారు.

## దళిత జనోద్ధరుడు విక్టర్ ప్రసాద్



చౌడేపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త
దళిత జనోద్ధరుడు మారుమూడి విక్టర్ ప్రసాద్ అని సమతాసైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు రవి అన్నారు. రాష్ట్ర ఎస్సీ కమీషన్ ఛేర్మన్‌గా విక్టర్ ప్రసాద్ నియమితులై సంవత్సరం పూర్తయిన సందర్బంగా దిగవపల్లి పంచాయతీ బోయకొండ గంగాపురంలో అభినందన సభ జరిగింది. దళితులు సమస్యల సాధన కోసం అహర్నిశలూ కృషి చేస్తున్న విక్టర్ ప్రసాద్ మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. అనంతరం యశ్వంత్, ఊర్మిలారెడ్డిలకు కులాంతర వివాహం జరిగింది. ఎస్ఎస్‌డి జిల్లా ఉపాధ్యక్షుడు మునెప్ప, మండలాధ్యక్షుడు గోపీకృష్ణ, కన్వీనర్ కూరపర్తి శ్రీనివాసులు, బ్యాంకు రెడ్డెప్ప, డిష్‌సూరి, గంగాధర్, రమణ, చెన్నరాయుడు, నలపరెడ్డి, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా నాయకుల మృతికి నివాళి



యర్రావారిపాలెం, ఆగస్టు 24 ప్రభాతవార్త
రెండు రోజుల క్రితం పెళ్లికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చంద్రగిరి నియోజక వర్గ తెదేపా నాయకులు భానుప్రకాష్, గంగువల్లి భాస్కర్‌లకు యర్రావారిపాలెంలో బుధవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారిద్దరి చిత్రపటాలకు తెదేపా నాయకులు కార్యకర్తలు నివాళులు అర్పించారు. వారి మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని తెదేపానాయకులు అన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు దేశిరెడ్డి రఘునాథ, ప్రధానకార్యదర్శి మహేష్‌నాయుడు, హరిశ్చంద్ర, కుంభానాగరాజ,చిన్నపరెడ్డి, కేశవులునాయుడు, చిన్నబ్బనా యుడు, చరణ్, మనోహరనాయుడు,బాలసుబ్రమణ్యం, శివ, చంద్రబాబు,పులిచెర్ల మహేష్, నవీన్,హరి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు వేగవంతం - ఎపిడి డాక్టర్ సుబ్రమణ్యం

యాదమరి, ఆగస్టు 24 ప్రభాతవార్త:
ఉపాధి పనులను మరింత వేగవంతం చేయాలని చిత్తూరు క్లస్టర్ ఎపిడి డాక్టర్ సుబ్రమణ్యం అన్నారు. యాదమరి మండలం దసరాపల్లిలో అవెన్యూ ప్లాంటేషన్, సిద్దారెడ్డిపల్లి పంచాయతీ నారాయణపురం హేబిటేషన్‌లోఎపిడి డాక్టర్ సుబ్రమణ్యం బుధవారం సందర్శించారు. ఈ సందర్బంగా నారాయణపురంలో ఆయనఉపాధి కూలీలతో లేబర్ మొబిలైజేషన్ సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులను వేగవంతంగా చేపట్టాలనిపనులు లేని వారిని గుర్తించి వారందరికీ పనులు కల్పించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని ఎపిఓ కవిత, ఇసి రమ్యలను ఆయన ఆదేశించారు. అలాగే ఆయన దసరాపల్లిలోని అవెన్యూ ప్లాంటేషన్‌ను తనిఖీ చేసి పొలాల్లో పాదుల ఏర్పాటును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ కవిత, ఇసి రమ్య, టిఎలు మనోహర్, మధు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

సూళ్లూరుపేట,కోట,వెంకటగిరి ,బాలాయపల్లి దొరవారిసత్రం,

## నాడు-నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి : ఎంపిపి



నాయుడుపేట రూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త;
నాడు-నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ది చేయడం జరుగుతుందని నాయుడుపేట మండల అధ్యక్షులు కురుగొండ ధనలక్ష్మి తెలియజేశారు. బుధవారం పూడేరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు ద్వారా మంజూరైన పాఠశాల భవనానికి ఆమె చేతులు మీదుగా భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి మాట్లాడుతూ నాడు-నేడు ద్వార పూడేరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు కోటిఏడు లక్షలు మంజూరైనట్లు ఆమె తెలిపారు.అందులో 65లక్షలతో పాఠశాల నూతన భవనం నిర్మాణం,42లక్షలతో పాఠశాలలో ఫర్నిచర్‌కు రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు.పాఠశాలలో నూతనంగా మంజూరైన తరగతి గదులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతమ్మ,పాఠశాల అభివృద్ధి కమిటి చైర్మన్ స్వరూప,ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## నాయుడుపేటలో వర్షం ...

నాయుడుపేట రూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త;
నాయుడుపేట మండలంలో బుధవారం తెల్లవారుజామున మోస్తారు వర్షం కురిసింది. ఈ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గతపదిరోజుల నుండి భానుడు భగభగ మంటూ మండుతూ ఉండి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని ఈదురుగాలలతో కూడిన వర్షం కురిసింది.దీంతో గ్రామాల్లో వీదులు,రోడ్లు బురధమయంగా మారాయి.ఈదుగాలులకు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్థంబాలు నేలకొరగడంతో విద్యుత్‌కు తీవ్రఅంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధప్రాదిపతికన మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్దరించారు.

## ఆహార పదార్థాల తయారీలో నిబంధనలు పాటించాలి

గూడూరు,ఆగస్టు 24 ప్రభాతవార్త



గూడూరు పట్టణ పరిధిలో హోటళ్లు,న్యూడిల్స్,ఫ్రైడ్‌రైస్,ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తయారు చేసే ఆహార పదార్థాల తయారీలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని కమిషనర్ సాయినాథ్ సూచించారు. గూడూరు పట్టణంలోని కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టేస్టింగ్‌సాల్ట్, రంగు,వెనిగర్ ఉపయోగించి ఆహార పదార్థాలను తయారు చేయవద్దని సూచించారు.ఎక్కడైనా వాడకూడని పదార్థాలు వాడి ఆహార పదార్థాలు తయారు చేసినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలు ఆహార వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలు

కోట, ఆగస్టు 24 ప్రభాతవార్త



కోట మండలం సిద్దవరం గ్రామంలో బుధవారం వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. పల్లకీ సేవ, అభిషేకా లు, ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి నిఅలంకరించారు. భక్తులు స్వామి వారితీర్థప్రసాదాలుఅందుకున్నా రు

## కాలవగట్టు గిరిజనులకు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం

కోట, ఆగస్టు 24 ప్రభాతవార్త
కోటలోని పంట కాలువపై గిరిజనులతో పాటు వివిధ కులాల వారు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. ఆ పంట కాలువపై అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారని కొంతమంది లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో నీటిపారుదల శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ఆ మేరకు ఇన్‌ఛార్జ్ ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు ద్వారా నోటీసులు అందజేయాలని నీటిపారుదల శాఖ అధికారులు ఆదేశాలిచ్చారు.ఆ మేరకు కాలువగట్టుపై కాలువను ఆక్రమించిన వారు 172 మంది ఉన్నారని గుర్తించారు. దీంతో గిరిజనులంతా వైసీపీ నాయకుల వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నారు. ఆ నాయకుడు అధికారులతో మాట్లాడి తాత్కాలికంగా గిరిజనులకు నోటీసులు ఇవ్వకుండా నిలుపుదల చేసినట్లు సమాచారం.

# శివారు ప్రాంతాల్లో మౌళిక వసతులు కల్పించాలి | కమిషనర్‌కు ఇన్సాఫ్ సమితి వినతి



గూడూరు,ఆగస్టు 24 ప్రభాతవార్త
గూడూరు మున్సిపాల్టీ గ్రేడ్-1 హోదా వచ్చినా పట్టణ శివారు ప్రాంతాల్లో కనీస మౌళిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గూడూరు పట్టణానికి చెందిన ఇన్సాఫ్ సమితి కమిషనర్ దృష్టికి తీసుకురావడం జరిగింది.బుధవారం ఇన్సాఫ్ సమితి ఆధ్వర్యంలో కమిషనర్ సాయినాథ్‌ను కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు.ఈసంధర్బంగా ఇన్సాఫ్ సమితి రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ షేక్.జమాలుల్లా మాట్లాడుతూ గూడూరు ఆర్టీసి బస్టాండు ప్రాంతం నుంచి పోటుపాలెం వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.సాధుపేట సెంటర్ నుండి జాతీయ రహదారి వరకు,రెండో పట్టణంలోని కోర్టు సెంటర్ నుండి నిమ్మకాయల మార్కెట్ వరకు సెంట్రల్ లైటింగ్ అమర్చాలని కోరారు. పందులు,కుక్కల బెడదను అరికట్టాలని కోరారు.ఇన్సాఫ్ సమితి గౌరవాధ్యక్షులు ఎండీ.అన్వర్‌భాష మాట్లాడుతూ గూడూరు పట్టణంలో దోమల నివారణకు ప్రతిరోజూ ఫాగింగ్ చేయాలన్నారు .సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.2వ అండర్‌బ్రిడ్జి వద్ద మురికినీరు నిల్వకుండా పంటకాలువ నిర్మాణం శాశ్వతంగా చేపట్టాలన్నారు.ఇన్సాఫ్‌సమతిసలహాదారు ఆర్ఎస్‌కే. జిలానీబాషా, డివిజన్ కమిటీ సభ్యులు సయ్యద్‌అల్తాఫ్,షేక్. మెహరోజ్,షేక్.ముబాజ్ శ్రీపాల్గొన్నారు.

## సీఎంను కలిసిన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి

కోట, ఆగస్టు 24 ప్రభాతవార్త



ప్రకాశం జిల్లా చీమకుర్తిలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తూర్పు రాయల సీమ పట్టభద్రుల వైసీపీ ఎంఎల్‌సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల గురించి శ్యాంప్రసాద్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్‌రెడ్డి తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో ఎంపీలను, ఎమ్మెల్యేలను, జిల్లా పరిషత్ ఛైర్మన్‌లను, మున్సిపల్‌ఛైర్మన్‌లను, ఇతర ప్రజాప్రతినిధులను కలిసి ఆశీస్సులు తీసుకున్నట్లు చెప్పారు.

## జడ్పీ వైస్ ఛైర్మన్ ఇలాఖాలో ఇన్‌ఛార్జీలే శరణ్యం

యాదమరి, ఆగస్టు 24 ప్రభవాతవార్త:
జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న యాదమరి మండలంలో కీలక విభాగాలకు ఇన్‌ఛార్జీలు ఇన్‌ఛార్జీలుగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడు-నేడు, గ్రామ సచివాలయాలు, వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలతో పాటు జగనన్న ఇళ్ళ నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ఈ నిర్మాణాలు త్వరితంగా పూర్తి కావాలంటే కీలకమైన శాఖలకు రెగ్యులర్ అధికారులు వుండాల్సివుంది. యాదమరి ఎంపిడిఓగా నియమితులైన శివరాజ్ చిత్తూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో మండల పంచాయితీరాజ్ ఎఇగా విధులు నిర్వహిస్తున్న ఇంజనీర్ బదిలీ కావడంతో ఇక్కడికి గుడిపాల మండల పిఆర్ ఇంజనీర్ జయచంద్రారెడ్డిని ఇన్‌ఛార్జీగా నియమించారు.అలాగేచెరువులసామర్థ్యంపెంచడానికిఇరిగేషన్ఇంజనీర్ కీలకపాత్ర పోషించాల్సి వుంటుంది. మండల ఇరిగేషన్ ఎఇగా కిషోర్ ప్రస్తుతం ఇన్‌ఛార్జీ ఎఇగా విధులు నిర్వహిస్తుండటంతో చెరువు పనులు సైతం మందకొడిగా జరుగుతున్నాయి. ఇక ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ళ నిర్మాణాల్లో హౌసింగ్ ఎఇ పాత్ర కీలకం. అయితే మండలంలో హౌసింగ్ ఎఇగా విధులు నిర్వహిస్తున్న ఎఇ గుణశేఖర్‌ను హౌసింగ్ శాఖ ఇటీవల చేసిన బదిలీల్లో కుప్పంకు బదిలీ చేశారు. ఈయన ఇప్పటి వరకు రిలీవ్ కాకపోయినప్పటికీ ఆయన మండలం నుండి రిలీవ్ అయితే పరిస్థితి ఏమిటనే పరిస్థితి నెలకొంది. అలాగే మండల విద్యాశాఖ అధికారిగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు నేడు-నేడు పనులు, మధ్యాహ్న భోజనం తదితరాలను ఎంఇఓ పర్యవేక్షించాల్సి వుంది. అయితే యాదమరి మండలంకు బంగారుపాళ్యం ఎంఇఓ నాగేశ్వరరావు ఇన్‌ఛార్జీ ఎంఇఓగా వ్యవహిస్తున్నారు. గ్రామ పాలనలో కీలకమైన జిల్లా పరిషత్‌కు వైస్ ఛైర్మన్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న భూమిరెడ్డి ధనంజయరెడ్డి ఇలాఖాలోనే జిల్లా అధికార యంత్రాంగం కీలక విభాగాలకు రెగ్యూలర్ ఎఇలు, అధికారులను నియమించకపోవడంతో జిల్లాలో ఇతర మండలాలపరిస్థితిఎలావుంటుందోనని ప్రశ్నలు అందరిలో ఉత్పన్నం అవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా అధికారులు స్పందించి మండలానికి రెగ్యులర్ ఎఇలు, అధికారులను నియమించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## నింద్ర ఇన్‌చార్జీ యంపిడిఓగా వేణు



నింద్ర,ఆగస్టు 24 ప్రభాతవార్త :
నింద్ర మండల ఇన్‌చార్జీ యంపిడిఓగా వేణు బుదవారం పదవీ భాధ్యతలు స్వీకరించినారు. గతంలో యంపిడిఓగా పని చేస్తావున్న అరుణ వడమాలపేట యంపిడిఓగా వెళ్ళిపోవడంతో ఆమె స్థానంలో ప్రస్తుతం యంపిడిఓ కార్యాలయంలో ఎఓగా పనిచేస్తా వున్న వేణుని ఇన్‌చార్జీ యంపిడిఓగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో వుండి ప్రజల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తాను అన్నారు.

## మారుమూడి విక్టర్ ప్రసాద్ సేవ అమోఘం

కేవీబీ పురం, ఆగస్టు 24 ప్రభాతవార్త:
కేవీబీ పురం రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ సమతా సైనిక్‌దళ్ జాతీయ కౌన్సిల్ మెంబరు మారుమూడి విక్టర్ ప్రసాద్ రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సేవలు అమోఘమైనవని తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ సమతా సైనిక్‌దళ్ అధ్యక్షుడు దొరైరాజ్, ప్రధాన కార్యదర్శి మహేష్‌లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌గా మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను నియమించి సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో బుధవారం సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించి కేవీబీ పురం మండల కేంద్రంలో ఏడు మండలాల అధ్యక్షులతో కార్యవర్గంతో నియోజకవర్గ కమిటీతో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా భారీ ఫ్లెక్సీ నియమించి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌గా నియమించడం వలన విక్టర్ ప్రసాద్ అలుపెరగని పోరాట యోధుడిగా దళితుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. విలేకరుల సమావేశంలో సత్యవేడు నియోజకవర్గ ఎస్ఎస్‌డీ ఉపాధ్యక్షుడు భోగి, మీడియా కో-ఆర్డినేటర్ దినకర్, కేవీబీ పురం మండల ఎస్ఎస్‌డీ అధ్యక్షుడు వి.శరవణ, నాగలాపురం మండల ఎస్ఎస్‌డీ అధ్యక్షులు కృష్ణ, పిచ్చాటూరు మండల ఎస్ఎస్‌డీ అధ్యక్షులు రాజదొరై, నింద్ర మండల ఎస్ఎస్‌డీ అధ్యక్షులు సంపత్, కేవీబీ పురం మండల ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, జాయింట్ సెక్రటరీ అనిల్, ఎస్ఎస్‌డీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్యాగరాజస్వామి వారి సంగీత మహోత్సవాలను జయప్రదం చేయండి!

-వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం



తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 24 ప్రభాతవార్త:
శ్రీ సద్గురు త్యాగరాజస్వామి వారి సంగీత మహోత్సవాలను ఈనెల 26వ తేదీ శుక్రవారం స్థానిక రామచంద్ర పుష్కరిణి వద్ద ఘనంగా నిర్వహి స్తున్నట్లు వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం,గౌరవాధ్యక్షుడు డా॥సత్యనారాయణలు తెలిపారు.బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ 26వ తేదీ మద్యాహ్నం రెండున్నర గంటలకు గాంధీరోడ్డులోని శ్రీరామ భజన మందిరం నుండి శ్రీ త్యాగరాజస్వామి వారి చిత్రపటంతో,నాదస్వరం,డోలు కళాకారుల వాయిద్య సమ్మేళన బృందంతో ఎన్టీఆర్ సర్కిల్,ఎస్వీ సంగీత కళాశాల మీదుగా రామచంద్ర పుష్కరిణి వరకు ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. కళాకారులు, కళాపోషకులు,కళాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా వారు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు ఊట్లవారిపల్లి మునిరత్నం,కార్యదర్శి పండ్లూరి గోవిందశెట్టి,బాలచందర్,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి - మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త



కుప్పం మున్సిపాలిటీ పరిధిలో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్సీ భరత్ ఆదేశాలతో గృహ నిర్మాణంపై సమీక్షించారు. లబ్దిదారులు గృహాలు త్వరగా కట్టుకునేలా ఇంజనీరింగ్ సిబ్బంది చూడాలన్నారు. అలాగే మహిళా సంఘాల ద్వారా రుణాలు సైతం అందించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్లు మునస్వామి, హఫీజ్, కమీషనర్ రవిరెడ్డి, డిఇ గురురాజన్, ఎఇలు, వర్క్ఇన్‌స్పెక్టర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరాలి..ఎంఎల్ఏ

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి చేరాలని శాసనసభ్యులు బియ్యపుమధుసూధన్‌రెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం గుడిమల్లం సచివాలయ పరిధిలోని పెనుమల్లం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ ప్రతి ఇంటింటికివెళ్ళి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా?లేదా? అని తెలుసుకున్నారు. అలాగే



గ్రామాల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం వృద్ధులకు ఫించను సకాలంలో అందుతుందా లేదా అని వారి ఫించనుకార్డులు తీసుకుని పరిశీలించారు. ఏసమస్యలు ఉంటే తానున్నానంటూ ఎంఎల్ఏ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి గున్నేరికిషోర్‌రెడ్డి, ఎంపిపి గీత, వైస్ ఎంపిపి శ్రీనివాసులు, జనార్ధన్‌రెడ్డి, జడ్పీటిసి తిరుమలయ్య, ఎంపిటిసి సావిత్రమ్మ, సర్పంచ్ చెంచులక్ష్మి, రాజశేఖర్‌రెడ్డి, రమేష్, ప్రసాద్, జగన్‌మోహన్‌రెడ్డి, బుజ్జిరెడ్డి, గిరి, చంద్రశేఖర్, హరిప్రసాద్ మండలనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 24 ప్రభాతవార్త



పట్టణంలోని కాసాగార్డెన్‌లో ఉన్న డాక్టర్ బిఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల చదువుకుంటున్న విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఈసందర్భంగా బుధవారం గురుకుల పాఠశాలలో భోజనాన్ని టిఎన్ఎస్ఎఫ్ బృందం తనిఖీచేసింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకంలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. వేలకోట్లు ఖర్చుపెట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్యనే కాక మంచి ఆహారాన్ని అందించాలని రాష్ట్రంలో అనేక గురుకుల పాఠశాలల్లో నాసిరకమైన ఆహారాన్ని అందిస్తున్నారని ఇకనైనా విద్యార్థులకు మంచి నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ఈసందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కోబాకలక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గోరుముద్ద పథకంలో అనేకమైన అవకతవకలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు సరుకులు అందిస్తున్నటువంటి కాంటాక్టర్లకు రూ. 27కోట్లు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిశీలనలో టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి పాలవాయి హేమంత్, ఉపాధ్యక్షుడు రాజేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'వైకాపా'వి దిగజారుడు రాజకీయాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 24 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు నారాచంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పం పర్యటనను అడ్డుకోవాలని చూసిన వైకాపా కోతి మూకకు కుప్పం ప్రజలు తగిన రీతిలో గుణపాఠం చెప్పారని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలలో నైతిక విలువలకు పాతరేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కొంతమంది అల్లరి మూకలకు డబ్బులు ఇచ్చి చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గంలో పర్యటించే మార్గాల్లో కవ్వింపు చర్యలకు దిగేలా ప్రవర్తించడం వైసిపి వారి దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. కుప్పం ప్రజల హృదయాలలో ఆరాధ్యుడిగా కొలవబడే చంద్రబాబునాయుడును ప్రజాక్షేత్రంలో గెలువలేక అసహనంతో కొందరు ఉన్మాదుల్లా చెలరేగిపోతున్నారన్నారు. శ్రీకాకుళం సిదిరి అప్పలరాజు, గుడివాడ గుట్కానాని, నెల్లూరు అనిల్, సత్తెనపల్లి సోగ్గాడు రాంబాబు, పుంగనూరు పెద్దారెడ్డి ఇలా అందరు కట్టకట్టుకుని వచ్చినా కుప్పం ప్రజల నుంచి చంద్రబాబునాయుడును దూరం చేయలేరని ఉమేష్ తెలిపారు

## సీజనల్ జ్వరాలపై ప్రజలకు అవగాహన

-గౌడమాలలో ప్రజలకు జ్వరాలు

తొట్టంబేడు, ఆగస్టు 24 ప్రభాతవార్త



ప్రస్తుత సీజనల్ జ్వరాలపై విద్యార్థులందరు అవగాహన కలిగి ఉండాలని తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పద్మజ, సూపర్‌వైజర్ కామరాజు అన్నారు. బుధవారం మండలంలోని గౌడమాలలో ఒకరిద్దరు జ్వరాల బారిన పడినట్లు తెలియడంతో సిబ్బందితో కలసి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ సీజనల్ జ్వరాలపై అవగాహన కలిగి ఉండాలని దోమల వల్ల వచ్చే వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటివి వ్యాపించి ప్రజారోగ్యం దెబ్బతినకుండా ప్రతి శుక్రవారం జరుగుతున్న ఫ్రైడే డ్రైడేలో ఆశా, ఎఎన్ఎం, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొని దోమల లార్వా ఉత్పత్తి స్థావరాల గుర్తింపు, నిర్మూలన జరిగేలా చూడాల్సిన అవసరమెంతైనా ఉందని పేర్కొన్నారు. నీళ్ళ విరేచనాలు లేదా డయేరియా ప్రజారోగ్యానికి హానిచేస్తోందని దీనికి ఓఆర్ఎస్ మరియు జింక్ మాత్రమే చికిత్సగా పేర్కొన్నారు. దీంతో మరణాలు తగ్గడమే కాకుండా వారిలో శక్తిని మరియు బలాన్ని యదాస్థితికి తీసుకొస్తుందన్నారు. హెల్త్‌సూపర్‌వైజర్ కామరాజు తెలిపారు. పిల్లల్లో డయేరియా కలగకుండా పాలిచ్చే తల్లి అతిసారం, అనారోగ్య సమయంలో మరియు తర్వాత కూడా విరేచనాలతో బాధపడుతున్న బిడ్డకు పాలివ్వడం ఆపరాదనీ ముఖ్యంగా పిల్లలకు రోజువారికన్నా అదనపు పాలు మరియు పోషకాహారం ఇవ్వాలని సూచించారు. పరిశుభ్రమైన పిల్లలకు రోజువారి కన్నా అదనపు పాలు మరియు పోషకాహారం ఇవ్వాలని సూచించారు. పారిశుద్యమేలోపమే సీజనల్ వ్యాధులకు ప్రధాన కారణం అన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఇందిర, ఎంఎల్‌హెచ్‌పి లిఖిత్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ మణెమ్మ, ఆశవర్కర్ రుక్మిణి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రతి మొక్కను బిడ్డలాగా సంరక్షించాలి

-సాయినగర్ పంచాయతీని పండ్లు, పూలచెట్ల తోటగా మారుస్తాం -గ్రామ సర్పంచ్ డి.వి.రమణ

తిరుపతిరూరల్, ఆగస్టు24 ప్రభాతవార్త:



సాయినగర్ గ్రామ పంచాయతీలో నాటిన ప్రతి మొక్కను బిడ్డలాగ సంరక్షించి పెంచాలని గ్రామ సర్పంచ్ డి.వి.రమణ పేర్కొన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో బుధవారం సాయినగర్‌లో ముమ్మరంగా చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డివి రమణ మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తుడా నిధులతో పంపిణి చేసిన 1000 మొక్కలను ఎన్ఆర్‌జిఎస్ సిబ్బంది సహకారంతో పంచాయతీలో రోడ్లకు ఇరువైపుల నాటుతున్నట్లు తెలిపారు. పూల, పండ్ల మొక్కలతో పాటు వెలగకాయ, రేగి చెట్లు, అడవి మల్లి, దేవ గన్నేరు పూల మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. సాయినగర్ పంచాయతీలో నాటిన ప్రతి మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత కూడా మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాతిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీరాములురెడ్డి, హేమలత, వినోద్, పంచాయతీ కార్యధర్శి రాజేష్, పద్మలత, ఎపిఓ మమత తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుని పూజిద్దాం : వినాయక నిమజ్జన కమిటి

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 24 ప్రభాతవార్త :

పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దామని వినాయక నిమజ్జన కమిటి ప్రతినిధులు గుండాల గోపినాథ్‌రెడ్డి, ఆర్.సి మునికృష్ణ, సామంచి శ్రీనివాస్, సుబ్రమణ్యంరెడ్డి, శ్రీను, నవీన్, కొండా చెంగారెడ్డి, నాగేశ్వరరావు, వెంకటేష్, గోపిప్రసాద్, వెంకట్ పిలుపునిచ్చారు. తిరుపతి-కరకంబాడి మార్గంలో ఉన్న బొమ్మల క్వార్టర్స్‌లో వినాయక ప్రతిమలను తయారు చేస్తున్న విధానాన్ని ఉపయోగిస్తున్న వస్తువులను కమిటి నాయకులు పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## 'కేంద్రీయ వైద్యశాల'ను యధాస్థానంలో కొనసాగించండి!

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 24 ప్రభాతవార్త:

గత 41 సంవత్సరాలుగా టిటిడి పరిపాలనా భవనం ప్రాంగణంలో ఉంటూ వేలాది మంది ఉద్యోగులకు వైద్య సేవలందించిన 'కేంద్రీయ వైద్యశాల'ను స్విమ్స్ ఆసుపత్రికి అనుసంధానం చేయకుండా యధాస్థానంలో కొనసాగించాలని టిటిడి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ టిటిడి ఈఓ ధర్మారెడ్డికి బుధవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 1981వ సంవత్సరం ఆగస్టు 25న అప్పటి టిటిడిపాలకమండలి అధ్యక్షుడు బి.నాగిరెడ్డి, ఈఓ పివిఆర్‌కె.ప్రసాద్‌ల సహకారంతో కేంద్రీయ వైద్యశాలను పరిపాలనాభవనం ప్రాంగణంలో ప్రారంభించారని గుర్తుచేశారు. టిటిడి ఉద్యోగుల నివాసాలకు కూతవేటు దూరంలో ఉన్న ఈ వైద్యశాల వలన ఎవరికైనా,ఏ సమయంలోనైనా ఆరోగ్యపరంగా అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు వైద్యశాల చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతి రోజు 250 నుండి 300 వరకు ఓపిలుడాక్టర్లుచూస్తున్నారు. ఈవైద్యశాలనుసిమ్స్‌కుఅనుసంధానంచేయడంవలన ఉద్యోగులకు,పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు చాలా ఇబ్బంది కలుగుతుంది. కావున పెద్ద మనసు చేసుకుని ఆసపత్రిని తరలించకుండా పురాలోచించాలని ఈఓ ధర్మారెడ్డిని చీర్ల కిరణ్ కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సర్కారు కృషి చేస్తోంది : డైట్ లెక్చరర్

నారాయణవనం, ఆగస్టు 24 ప్రభాతవార్త :



ప్రభుత్వ బడులను బలోపేతం చేయడం కోసం సర్కారు కృషి చేస్తున్నట్టు కార్వేటినగరం డైట్ లెక్చరర్ బి చెంగల్రాజు తెలిపారు. బుధవారం మండలంలోని కొండలచెరువు, బండమీద ఇళ్లు, జంగాలపల్లి, ఉజ్జినాయుడుకండ్రిగ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం నాడు-నేడు, జగనన్న విద్యా దీవెన, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, వంటి పథకాలను ఎటిష్టంగా అమలు గురించి హెడ్‌మాస్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధన తరగతులను పరిశీలించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలను ఇచ్చారు. అనంతరం విద్యా పరిశోధన శిక్షాణ సంస్థ ద్వారా నిర్వేధించిన లెర్న్ ఎ వర్డ్ ఎ డే రీడింగ్ మారథాన్ అకాడమీ క్యాలెండర్ నిర్వహణ మొదలైనా అంశాల అమలు గురించి తెలుసుకొని, అత్యున్నత ప్రమాణాలు సాధించదానికై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు తగు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, సత్యేంద్రకుమార్, ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్పీఎఫ్ పీడబ్ల్యూఏ నూతన కార్యవర్గం ఏకగ్రీవ నియామకం

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 24 ప్రభాతవార్త :



స్థానిక ఆర్పీఎఫ్ బ్యారక్స్‌లో బుధవారం ఉదయం ఆర్పీఎఫ్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షిక సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దక్షిణ మధ్య రైల్వే ఆర్పీ ఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.వరప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్ ఏఎస్‌సీ రేణిగుంట, మధుసూధన్ ఐపీఎఫ్‌లు హాజర య్యారు. ఈ సందర్భంగా వారు ఆర్పీఎఫ్ పీడబ్ల్యూఏ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరుకొత్తకార్యవర్గాన్నిస్వాగతంపలుకుతూ, పాత కార్యవర్గాన్ని వీడ్కోలు పలికారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామని అధ్యక్ష, కార్యదర్శులు మురుగేషన్, మనోహరం తెలిపారు.

## జీర్ణించుకోలేని గుండెకోత తెలుగుతమ్ముళ్ళ మరణం



గంగపల్లి భాస్కర్, బన్నీలకు టిడిపి సంతాపం

చంద్రగిరి, ఆగస్టు 24 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీలో సుశిక్షితులైన నాయకత్వపు పటిమతో రాణిస్తున్న తెలుగుతమ్ముళ్ళ మరణం జీర్ణించుకోలేని గుండెకోతను మిగిల్చింది. టిడిపి చిత్తూరు (పార్లమెంటరీ నియోజకవర్గ) జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగపల్లి భాస్కర్, తెలుగుయువత చంద్రగిరి మండల అధ్యక్షుడు భానుప్రకాష్ రెడ్డి వివాహ వేడుకలకు వెళుతూ మంగళవారం రోడ్డు ప్రమాదంలో అశువులుబాసారు. ఈ నేపథ్యంలో టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు అధ్యక్షతన బుధవారం ఉదయం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నరశింహ ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ చురుగ్గా వ్యవహరిస్తున్న ఇద్దరు నాయకులను కోల్పోవడం తీనిలోటన్నారు. గంగపల్లి భాస్కర్‌తో తమకు విడదీయలేని అనుబంధం వుందన్నారు. వారిని అకాల మరణం తమకు తీరని మనోవేదనను మిగిల్చిందన్నారు. అంతకు ముందు పార్టీ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ అత్యంత సన్నిహితులు, క్రమశిక్షణ కలిగిన నాయకులను కోల్పోవడం పార్టీ తీరనిలోటని ఆవేదన చెందారు. మృతుల చిత్రాలతో కూడిన భారీ ఫ్లెక్సీని తయారు చేయించారు. ఈ క్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, నాయకులు ముండ్లూరి బాలకృష్ణమ నాయుడు, దుబాసి రామమూర్తి, మాజీ జడ్పీటిసి అమ్ములు, సజ్జా పురుషోత్తం నాయుడు, రాకేష్ చౌదరి, శంకర్, దొమ్మలపాటి సతీష్, చెంగల్రాయ ఆచ్చారి, హరి, తదితరులు పాల్గొన్నారు.

## దేశ సౌభాగ్యమే లక్ష్యంగా శ్రీవరలక్ష్మి వ్రతం

టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ

చంద్రగిరి, ఆగస్టు 24 ప్రభాతవార్త:



భారతదేశ సౌభాగ్యమే లక్ష్యంగా కొటాల రామాలయం ఆవరణలో బుధవారం శ్రీవరలక్ష్మి వ్రతం నిర్వహించినట్లు టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ దొరస్వామి నాయుడు తెలిపారు. మండల పరిధిలోని కొటాల గ్రామంలో హైందవ సంప్రదాయ పద్ధతిలో శ్రీరామభక్తబృందం ఆధ్వర్యంలో శ్రీవరలక్ష్మి వ్రతాన్ని రుత్విక్కులు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీవినాయక హోమం, నవగ్రహశాంతి హోమం నిర్వహించారు. శ్రీలక్ష్మీదేవి అమ్మ వారిని విశేష అలంకరణలతో తీర్చిదిద్దారు. వరలక్ష్మి అమ్మవారిని ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. 108 మంది మహిళలు అష్టోత్తర శత కళశాభిషేకం, సంకల్ప వ్రతదీక్షలు చేశారు. కలశాలల్లోని పవిత్ర జలాలతో సీరామలక్ష్మణ ఆంజనేయస్వామి వార్ల మూలమూర్తులకు అభిషేకించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో శ్రీరామభక్తబృందం భక్తులకు అన్నదానం జరిపించారు.

## తల్లిపాల ఆవశ్యకత పై అవగాహన

తిరుపతి (విద్య), ఆగస్టు 24, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయ న కేంద్రంలో పనిచేస్తున్న రీడర్ డా. హైమావతి తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని తిరుపతి తాటితోపు లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలు పాలిచ్చే తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2021 ప్రకారం కేవలం 41.6 శాతం తల్లులు మాత్రమే మొదటి గంటలో తల్లిపాలు ఇస్తున్నారు. ఒక అంతర్జాతీయ అధ్యయనంలో మన దేశంలో ప్రతి సంవత్సరం నీళ్ల విరోచనాలు, నిమోనియా వంటి జబ్బులతో సుమారు ఒక లక్ష మంది పిల్లలు మరణిస్తున్నారు. తల్లిపాలు ఇవ్వని కారణంగా ప్రతి ఏటా సుమారు 7 వేల మంది తల్లులు రొమ్ము క్యాన్సర్, 1700 మంది అండాశయ క్యాన్సర్, 87 వేల మంది తల్లులు చక్కెర జబ్బు బారిన పడుతున్నారని వివరించారు. 2019లో హెల్త్ పాలసీ అండ్ ప్లానింగ్ అధ్యయనం ప్రకారం లక్ష మంది మన దేశంలో పిల్లల మరణాలు సంభవిస్తున్నాయి. పిల్లలులో నిమోనియా కేసులు 24,70,429, నీళ్ల విరోచనాలు కేసులు 3,47,91,524 పిల్లల్లో ఊబకాయం 40,382, రొమ్ము క్యాన్సర్ జబ్బులతో తల్లులు 7,976 అండాశయ క్యాన్సర్ జబ్బులతో తల్లులు 1748, మధుమేహం వ్యాధితో తల్లులు 87855 మంది జబ్బుల భారిన పడ్డారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం అప్పుడే పుట్టిన బిడ్డలకు పోషకాలన్ని సమృద్ధిగా అందాలంటే తల్లిపాలకు మించిన పరిష్కారం లేదని బిడ్డ పుట్టిన మొదటి మూడు రోజులు తల్లిపాలలో యాంటీబాడీలు, ప్రోటీన్లు ఇతర పోషక పదార్థాలు ఎక్కువగా ఉంటాయని వాటితో అనేక వ్యాధులను సమర్ధంగా ఎదుర్కొనే శక్తి వస్తుందని అప్పుడే శిశు మరణాలను తగ్గించవచ్చని అన్నారు.

# నడిరోడ్డుపై నిర్మాణాలకు రాజకీయ నాయకుల అండ

## మూసుకుపోతున్న రోడ్లు

శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో ఆక్రమణ దారులకు రాజకీయ నాయకుల అండ ఉండటంతో రోడ్లు మూసుకుపోతున్నాయి. రోడ్ల మీదకు దుకాణాలు నిర్మాణాలు విస్తరించటంతో రాను రాను రోడ్లు కుచించుపోతున్నాయి. దాంతో నడవటానికి కూడా ఇబ్బంది కర పరిస్థితి చోటు చేసుకుంటుంది. అధికారులు ఏమో ఆక్రమణలు తొలగించాలని హంగామా చేస్తున్నారు. అయితే రోడ్ల మీదకు విస్తరిస్తున్న నిర్మాణాలకు సంబంధించి స్థానిక మున్సిపల్ కార్యాలయ అధికారులు స్పందించరనే భావంతోత కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తపేటకు చెందిన న్యాయవాది ఎ. బాలాజి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసారు. ఇక్కడ నడివీధిలో నిర్మాణాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించి ఆపివేయాలని ఎక్కడ ఉన్న చోట అక్కడే ట్రాన్స్‌ఫార్మర్ ఉండాలని విద్యుత్ శాఖకు జిల్లా కలెక్టర్ ఆదేశించటం గమనించదగ్గ విషయం. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కొత్త గాండ్ల వీధిలో పట్టణం అభివృద్ధి చెందని రోజుల్లో నడిరోడ్డుపై గుడిసెలు వెలిసినాయి. అయితే ఇక్కడ ప్రజల సౌకర్యాలను గుర్తించిన ఈ ప్రాంత నాయకులు వాటిని తొలగించి ప్రత్యామ్నాంగా ఇంటి స్థలాలు ఆర్థిక సహాయం చేసి రోడ్డును నిర్మించారు. అయితే తరువాత మళ్ళీ రోడ్ల మీదకు నిర్మాణాలు వస్తుండటంతో స్థానికుల అభ్యంతరంతో సర్వేజరిపిన మున్సిపల్ కమిషనర్ స్థలం మున్సిపాలిటిదే అని నిర్ధారించి అక్రమ కట్టడాలను ఆపివేసారు. చక్కటి సిమెంటు రోడ్డును నిర్మించారు. కానీ ప్రస్తుతం కొందరు రాజకీయ పలుకుబడితో నాయకుల సిఫార్సులతో ఇంటి నిర్మాణం తమ స్థలంలో నిర్మించుకొని ఆరు అడుగులు మెట్లు రోడ్డు మీదకు తెచ్చారు. ఈ నిర్మాణాల వల్ల రోడ్డు కుచించుకు పోతుందని రాక పోకలకు అంతరాయంకల్గుతుందని ప్రజలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడ పురాతన కాలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డు మీదకు తీసుకురావటానికి విద్యుత్ అధికారులు సాహసించినట్లు జిల్లా కలెక్టర్‌కు పంపిన ఫిర్యాదులో బాలాజి పేర్కొనటంతో కలెక్టర్ ట్రాన్స్‌ఫార్మర్ తరలింపును ఆపాలని సూచించారు. అయితే రోడ్డు మీదకు విస్తరిస్తున్న కట్టడాలు మాత్రం రాజకీయ నాయకుని సిఫార్సు అంటూ కొన సాగుతుంది.

# తిరుపతి డివిజన్

## గరిష్ట కూలీ వచ్చేలా ఉపాధి పనులు చేపట్టండి : ఎపిడి

నింద్ర,ఆగస్టు 24 ప్రభాతవార్త :



గరిష్ట కూలీ వచ్చేలా ఉపాధి పనులు చేపట్టాలని క్లస్టర్ ఎపిడి శోభన్‌బాబు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని సియల్ఆర్‌సి భవనంలో నగరి, నాగలాపురం, నింద్ర, పిచ్చాటూరు, విజయపురం, పాలసముద్రం క్లస్టర్ మండలాల ఉపాధి అధికారులు సిబ్బందితో సమీక్ష సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎపిడి శోభన్‌బాబు మాట్లాడు తూ ఉపాధిహామి పనులకు వచ్చే వేతనదారులకు గరిష్ట కూలీ రూ. 257లు వచ్చేలా మార్కింగ్ ఇచ్చి పనులు చేపట్టాలని తెలిపారు. పని ప్రదేశాలలో పని చేపట్టే ముందు క్షేత్రసాంకేతిక సహాయకులు మార్కింగ్ ఇచ్చి కొలతులు ప్రకారంగా పనులు చేయించాలన్నారు. తద్వారా ఉపాధి వేతన దారులకు గరిష్ట కూలీ వచ్చే అవకాశం కలుగుతుందని ఆయన అన్నారు. మండలాలకు నిర్ణయించిన పని దినాలు లక్ష్యాన్ని తప్పక చేరుకోవాలని ఆయన సూచించారు. వర్షాకాలం ప్రారంభమైనందున మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని తెలిపారు. మామిడిపండ్లు తోటలతో పాటు మల్లె, రోజా వంటి పూలతోటల సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. గత ఏడాది నాటిన మొక్కలకు విదిగా నీరు పోయించి బతికేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎపిఓలు బబిత. కవిత, సూధాకర్, బాల, జెఇలుసురేష్, అనుషా, కిశోర్, భాస్కర్‌రావు, శ్రీధర్, సాంకేతిక, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

## భక్తిప్రవర్తలతో గంగజాతర

పుత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:



పుత్తూరు మండల పరిధిలోని తిరుమలకుప్పం గ్రామంలో గ్రామదేవత గంగజాతర కార్యక్రమం భక్తిప్రవర్తలతో నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి అమ్మవారిని ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి డప్పు వాయిద్యాల నడుమ వైభవంగా పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం ఉదయం ఆలయ ఆవరణలో భక్తులు అమ్మవారికి పిండీ దీపాలు పెట్టి పూజలు చేశారు. అలాగే కుంభాలు వేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. గ్రామంలో వీధులన్నీ విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు. సాయంత్రం అమ్మవారిని నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ గ్రామంలో విశిష్టత.... గత కొన్ని సంవత్సరాల తరువాత గంగజాతర కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే గ్రామాల్లో గంగజాతర నిర్వహించే భక్తులు ఒక గంగమ్మను మాత్రమే పెట్టి పూజలు చేసి అనంతరం నిమజ్జనం చేసేవారు. అయితే ఈ గ్రామంలో రెండు గంగమ్మలను ఏర్పాటు చేసి పూజలు చేసి ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ గ్రామంలో ఈ ఒక ఆచారం ప్రకారం జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు. గతంలో పెద్దవారు పూర్వీకులు రెండు గంగమ్మలను పెట్టి పూజ చేసే వారిని ఆ గ్రామస్థులు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో చాటు బండి ఊరేగింపు

పుత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలో గంగజాతర సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి చాటుబండి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్వేటినగరం రోడ్డులోని మంచినీళ్ళగుంట వద్దనుంచి ప్రారంభించారు. అనంతరం బజారువీధిలో గంగమ్మ ప్రతిమను ఏర్పాటు చేశారు. ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. గ్రామీణ పట్టణ ప్రాంత భక్తులు అధికంగా హాజరై విశేష పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గంగజాతర కమిటీ వారు ప్రత్యేకమైన ఏర్పాటు చేశారు. అమ్మవారికి కుంభాలు నైవేద్యం సమర్పించారు. సాయంత్రం బలి కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఆలయ ఆవరణలో రాత్రి పాటకచ్చేరి కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు డప్పు వాయిద్యాలు మధ్య ఊరేగించి నిమజ్జనం కార్యక్రమం చేపట్టారు.

## ఘనంగా ముగిసిన 'కార్గో డోర్ డెలివరీ' ప్రచార మాసోత్సవాలు!

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 24 ప్రభాతవార్త:




రాష్ట్ర వ్యాప్తంగా ఏపిఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో జూలై 27 నుండి ఆగస్టు 24 వరకు 28 రోజుల పాటు జరిగిన 'కార్గో డోర్ డెలివరీ' ప్రచార మాసోత్స వాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎం. భాస్కర్ నేతృత్వంలో సెంట్రల్ బస్‌స్టేషన్‌లోని శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండల బస్‌స్టేషన్ల గుండా ప్రచార ర్యాలీ నిర్వహించి ప్రజలు, ప్రయాణికులకు కార్గో డోర్ డెలివరీ సదుపాయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిప్యూటీ సిటిఎం మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ వారు రాష్ట్రమంతటా 84 కౌంటర్ల ద్వారా కార్గో డోర్ డెలివరీ సౌకర్యం కల్పించిందన్నారు. తక్కువ ఛార్జీలతో తక్కువసమయంలో సురక్షితంగా వస్తువులకు ప్రజల ఇంటి వద్దకే చేర్చడం జరుగుతోందన్నారు. వారి వారి ఇంటి వద్ద నుండే రాష్ట్రంలోని అన్ని ప్రధాన పట్టణాలు, నగరాలకు పార్సిళ్లను చేరవేయడం జరుగుతుందన్నారు. ర్యాలీ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్)జిఎల్‌పివి. సుబ్బారావు, బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డిఆర్. నాయుడు, తిరుపతి డిపో మేనేజర్ బాలాజి, మంగళం డిపో మేనేజర్ ఎం. భాస్కర్, చీఫ్ సెక్యూరిటీ ఇన్స్‌పెక్టర్ చలపతి, సూపర్‌వైజర్లు, అసోసియేషన్ నాయకులు, ఆఫీసు సిబ్బంది, సెక్యూరిటీ, గ్యారేజీ, కార్గో సిబ్బంది, తదితరులు పాల్గొని కరపత్రాలు పంచుతూ డోర్ డెలివరీపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

## మత్తు జీవితాలను చిత్తు చేస్తుంది

రేణిగుంట, ఆగస్టు 24 ప్రభాతవార్త:



మత్తు పానీయాలు సేవిస్తున్న వారి జీవితాలను అది చిత్తు చేస్తుందని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మత్తు పానీయాల సేవించడం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులోపలువురు వక్తలు మాట్లాడుతూ మత్తు పానీయాలు అలవాటు పడితే జీవితాలు సర్వనాశనం అవుతాయన్నారు. తద్వారా దేశం కుటుంబాలకు కుటుంబాలు దుర్భర దరిద్రాన్ని అనుభవించాల్సి వస్తుందని పేర్కొన్నారు. మద్యం సేవించడం వల్ల ఎన్నో అనారోగ్యాలు సంక్రమిస్తాయన్నారు. మద్యం సేవించి బాధపడడం కంటే సేవించకుండా జాగ్రత్త పడడం మేలు అన్నారు. మద్యపానాన్ని ఎలా మానుకోవాలి తెలియజేశారు. సదస్సులో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జమున, మద్యపాన విమోచన కమిటీ అధ్యక్షులు లక్ష్మణరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ నాథమునిరెడ్డి, పాస్‌సంస్థకు చెందిన మంజుల తదితరులు కళాశాల విద్యార్థులు, బోధనేతర సిబ్బందితో మద్యపాన సేవనం మంచిది కాదని ప్రతిజ్ఞ చేయించారు.

## శాస్త్రోక్తంగా శ్రీ గంగమ్మ ఆలయ కుంభాభిషేకం

రేణిగుంట, ఆగస్టు 24 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం ఎల్లమండ్యం పంచాయతీ మర్రిగుంటలో వెలసిన గ్రామదేవత శ్రీ గంగమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవం బుధవారం సాంప్రదాయ బద్ధంగా జరిగింది. విశేష హోమ పూజలు, శాస్త్రోక్తంగా చేశారు. కుంభాభిషేకం పాటు శక్తి రాయి ప్రతిష్టించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహోత్సవంలో రేణిగుంట మాజీ జడ్పీటీసీ చిన్నక్క తిరుమలరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పెద్దలు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువ, పూలమాలలతో సత్కరించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహోత్సవంలో వైకాపా నాయకులు గంగయ్య, గుణ, ఆలయ పెద్దలు చంద్రారెడ్డి, ఎన్. కందస్వామి, జయకుమార్, ఢిల్లీరెడ్డి, రాజేష్, నాగరాజు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంచార్జి ఎంపిడిఓ గుణశేఖర్‌కు సన్మానం

నారాయణవనం, ఆగస్టు 24 ప్రభాతవార్త :

మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఇంచార్జి)గా బాధ్యతలు స్వీకరించిన గుణశేఖర్‌ని మండల గ్రామీణా ఉపాధిహామి పథకం అధికారులు, సిబ్బంది బుధవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎపిఓ నాగభూషణ మాట్లాడుతూ ఇదే ఎంపిడిఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన అందరి చేత మన్ననలను అందుకున్న గుణశేఖర్ ఇంచార్జ్ ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా వుందన్నారు. గతంలో విధంగా విధులను మరింత పటిష్టంగా నిర్వహించాలని కోరారు. అనంతరం దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల ఇంజనీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మెట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# నా నోరు కట్టించడం మిమ్మల్ని పుట్టించిన దేవుడి వల్ల కాదు

## ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు - ప్రజల గొంతుకగా నేను వస్తాను.. నాపైనే దాడులకు దిగుతారా..?

## - వైకాపాను బంగాళాఖాతంలో కలపాలని ప్రజలకు పిలుపు .. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సత్తా తెదేపాదే !!

రామకుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త

వైకాపా అరాచకాలు, బాదుళ్లపై తాను మాట్లాడకూడదని తాను మాట్లాడితే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని తన నోరు కట్టించాలని చూస్తున్నారని అది మీ వల్ల కాదు.. మిమ్మల్ని పుట్టించిన దేవుడి వల్ల కూడా కాదు అని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. బుధవారం రాత్రి రామకుప్పంలో జరిగిన బాదుడే బాదుడు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రజల గొంతుకగా తాను మాట్లాడుతానని పేర్కొన్నారు. శాంతికి మారుపేరైన కుప్పంకు తాను వస్తే తనపైనే వైకాపా మూకలు దాడికి దిగడం దారుణమన్నారు. వైకాపా రౌడీలు, నేరస్తులకు తాను భయపడాలా?అని ప్రశ్నించారు.కుప్పం ప్రజలు తనను ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. 14 ఏళ్లు సిఎంగా పనిచేశానన్నారు. పంచాయతీ ఎన్నికల్లో తమిళనాడు నుంచి రౌడీలను తెచ్చి పుంగనూరు పుడింగి ఇక్కడ రౌడీయిజం చేసి గెలిపించుకున్నారన్నారు. సిఎం జగన్‌రెడ్డికి పైశాచిక ఆనందమని కుప్పంలో గెలుస్తామంటున్నారని ఆయన పులివెందులలో ఎలా గెలుస్తారో చూస్తానన్నారు. అసెంబ్లీలో, బయటా బూతులు మాట్లాడుతున్నారన్నారు. మూడున్నర ఏళ్లలో రాష్ట్రంలో ఏదైనా అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. ఆంధ్ర అంటే అందరూ భయపడే పరిస్థితికి వచ్చారన్నారు. పెట్టుబడులు పెట్టేవారు రావడం లేదన్నారు. నాడు -నేడు అంటూ ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతపడుతున్నాయన్నారు. కుప్పంలో తమిళనాడు బియ్యం అక్రమ రవాణాపై తమిళిసిఎంకు లేఖరాస్తే చెక్‌పోస్టులు పెట్టారన్నారు. కర్ణాటక, తమిళనాడునుంచి వైకాపా నేతలు మద్యం తెచ్చి డోర్ డెలివరీ చేస్తున్నారన్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలు మన రాష్ట్రంలోనే ఉన్నాయన్నారు. మద్యం బ్రాండ్లన్నీ జగన్ బ్రాండ్లేనన్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలో దోపిడీ రాజ్యం



జరుగుతోందన్నారు. అమూల్ డెయిరీపై ఎందుకంత ప్రేమ అని ప్రశ్నించారు. ప్రజల ఆస్తులు, శ్రమలను వైకాపా నేతలు దోచుకుంటున్నారన్నారు. కుప్పంలో అభివృద్ధి పూర్తిగా ఆగిందన్నారు. కుప్పంపై కక్షగట్టారన్నారు. ప్రజలు వైకాపాను బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. తెదేపా అధికారంలో రాగానే పరిశ్రమలు, ఐటి రంగాలను తెస్తామన్నారు. వైకాపా ప్రభుత్వం 8లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. అధికారంలో రాగానే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ఆసత్తా తెలుగుదేశం పార్టీకే ఉందన్నారు.

## బుడుగులు బడికి వెళ్లిది ఎప్పుడు..?

### - పూర్తికాని అంగన్‌వాడీ కేంద్రాల విలీన ప్రక్రియ



కోట, ఆగస్టు 24 ప్రభాతవార్త : నూతన విద్యావిధానం అమలులో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఉన్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీప ప్రాథమికోన్నత పాఠశాలలకు మ్యాపింగ్ చేశారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు అందరూ విలీనం చేసిన పాఠశాలలకు వెళ్లిపోయారు. వారితో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు పూర్వ ప్రాథమిక విద్య నిమిత్తం ప్రాథమిక పాఠశాలకు వెళ్లాల్సి ఉండగా, ఇప్పటివరకు ఆ ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతో ప్రాథమిక పాఠశాలల భవనాలు ఖాళీగా ఉంటే, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇరుకు గదుల్లో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక పాఠశాలలకు కిలోమీటరు పరిధిలో ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి, తదితర అంశాలపై వివరాలు సేకరించి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అనుబంధ పోర్టల్‌లో నమోదు చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను కూడా గుర్తించి నివేదిక సిద్ధం చేశారు. ప్రస్తుతం అలాంటి కేంద్రాలన్నింటినీ సమీప పాఠశాలల్లో విలీనం చేసి పూర్వ ప్రాథమిక విద్య అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగానే మౌలిక సదుపాయాలు, గదులు, మరుగుదొడ్లు, వంట గదులు తదితర వసతులు ఉన్న పాఠశాలల్లో కేంద్రాలను విలీనం చేయడానికి చర్యలు చేపట్టారు. కొత్త విధానంలో అంగన్‌వాడీ చిన్నారులను ప్రీ ప్రైమరీ 1, 2 తరగతులను విభజించి పాఠశాలల్లోనే బోధించాల్సి ఉంది. దానికి అనుగుణంగా కూడా ఏర్పాట్లు చేశారు. కానీ ఇప్పటివరకు చిన్నారులను మాత్రం కేంద్రాలకు తరలించలేదు. దీనికి సంబంధించిన ప్రక్రియ ఇంకా జరుగుతూనే ఉందని అధికారులు అంటున్నారంటే ప్రక్రియ ఏ విధంగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

## ఉత్సవాలను సమిష్టిగా పనిచేసి ఘనంగా నిర్వహించాలి

### -ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 24 ప్రభాతవార్త : హిందువులకు అత్యంత పవిత్రమైన వినాయక ఉత్సవాలను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సమిష్టిగా పనిచేసి ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమైళీశ్వ రరెడ్డి తదితరులతో సమావేశం నిర్వహించారు. ఒక గొప్ప సందేశాన్ని ఆధ్యాత్మిక రాజధాని అయినటువంటి తిరుపతి నగరంలో ప్రజల భాగస్వామ్యంతో వినాయక ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించనున్నారని తెలిపారు. వినాయక నిమజ్జనోత్సవంలో ఎటువంటి అవాంఛనీయం సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకొని పండుగను విజయవంతంగా నిర్వహజంచే విధంగా వినాయకుడి ఆశీస్సులు ఉండాలని వుండాలని వేడుకుంటున్నారన్నారు.

**గణపతి విగ్రహ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే**

తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయం ఆవరణలో వినాయక చవితి సందర్భంగా గణపతి విగ్రహాన్ని ఏర్పాట్లను వైభవంగా నిర్వహించే చూడాలని నగరపాలక అధికారులను ఎమ్మెల్యే భూమన పిలుపునిచ్చారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఆగస్టు 31వ తేదీ వినాయక చవితి ఘనంగా జరుపుకోవడం కొరక నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్లు పాల్గొంటారని తెలిపారు.

## శరవేగంగా చైర్మన్ క్యాంపు కార్యాలయం నిర్మాణం

### -సెప్టెంబర్‌లో ప్రారంభానికి చర్యలు

తిరుమల,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:టిటిడి పాలకమండలి చైర్మన్ క్యాంపు కార్యాలయం శాశ్వతంగా ఒకేచోట ఉండేలా చూస్తూ అందుకు తగ్గట్లు భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ భవనాన్ని పద్మావతి విచారణ కార్యాలయం ప్రాంతంలోనే అధునాతనంగా నిర్మిస్తున్న విషయం విదితమే. జూన్ 24న చైర్మన్ క్యాంపు కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ జరిగింది. గత రెండునెలలుగా ఈ భవనం హంగులతో నిర్మాణం జరుగుతోంది. ఇప్పటికే భవనాన్ని పూర్తిస్థాయిలో టిటిడి ఇంజనీరింగ్ విభాగం నిర్మాణం పనులు పూర్తిచేసింది. ఇంకా కొంతవరకు నిర్మాణం, రంగులు వేయడం చేయాల్సివుంది. తిరుమలలో టిటిడి పాలకమండలి చైర్మన్ క్యాంపు కార్యాలయం శాశ్వత భవనం లేదు. గతంలో చైర్మన్లుగా పదవీకాలం నిర్వహించిన వాళ్ళు ఎక్కడో ఓ చోట అతిధిగృహాన్ని తీసుకుని పరిపాలన కార్యాలయానికి తగ్గట్లు తీర్చిదిద్దేవారు. దీనివల్ల టిటిడిపై ఆర్థిక భారం పడేది. ఆ పాలకమండలి పదవీకాలం పూర్తవగానే మళ్ళీ భక్తులకు అతిదిగృహాల గదులను పునర్మించేవారు. కోట్లరూపాయలు నష్టం జరిగేది. గత కొంతకాలంగా చైర్మన్ క్యాంపు కార్యాలయం చైర్మన్ వైవి సుబ్బారెడ్డి తన సొంత తిరుమలస్వర్ణలత విశ్రాంతి భవనంలో తొలుత నిర్వహించారు. ఆ తరువాత ప్రస్తుతం సన్నిధానం అతిదిగృహంలో ప్రత్యేకంగా గదులను తీర్చిదిద్ది నిర్వహిస్తున్నారు. ఇలా చేయడం వల్ల భక్తులకు గదులు కొరత ఏర్పడి వసతి తంటాలు పడుతున్నారు. దీన్ని నివారించేందుకు వీలుగా సొంతంగా దాతల సహకారంతో చైర్మన్ క్యాంపు కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. ఫోనిక్స్‌ఫౌండేషన్ యాజమాన్యం దాత సహకారంతో, నెల్లూరు



విఎస్ఎల్ ప్రాజెక్ట్స్‌యాజమాన్యం తిరుమలలో చైర్మన్ క్యాంపు కార్యాలయాన్ని అన్ని హంగులతో నిర్మిస్తోంది. ఈ భవనం నిర్మాణం పూర్తయి సెప్టెంబర్ 27న తిరుమలకు వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించేందుకు చూస్తున్నారు.

## దళితుల ఆశాజ్యోతి సీఎం జగన్మోహన్‌రెడ్డి

### - రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్‌గా విక్టరీ ప్రసాద్

### - ఏడాది పూర్తయిన సందర్భంగా సంబరాలు, స్వీట్లు పంపిణీ

### - తిరుపతి జిల్లా ఎస్ఎస్‌డీ అధ్యక్షులు సి.రెడ్డెప్ప

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 24 ప్రభాతవార్త : దళితుల ఆశాజ్యోతి ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని సమతా సైనిక్ ధళ్ (ఎస్ఎస్‌డీ) తిరుపతి జిల్లా అధ్యక్షులు సి.రెడ్డెప్ప తెలిపారు. అంబేద్కర్ ఆశయ రధసారధి ఎస్సీ కమీషన్ చైర్మన్ మారుమూడి విక్టరీ ప్రసాద్‌కు సీఎం జగన్మోహన్‌రెడ్డి పదవి ఇచ్చి ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం సి.రెడ్డెప్ప ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. అనంతరం స్థానికులు స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. సి. రెడ్డెప్ప మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా దళిత సమాజానికి అండగా వేల పోరాటాలను ముందుండి నడిపిన వ్యక్తి విక్టరీ ప్రసాద్ అన్నారు. అలాగే అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి ఆయన చేసిన కృషిని జగన్ గుర్తించి పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌డీ తిరుపతి జిల్లా అధ్యక్షులు సి. రెడ్డెప్పతో పాటు రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.పవన్‌కుమార్ (బిట్టు), మహిళా జిల్లా అధ్యక్షురాలు లోకేశ్వరి, సంస్థ ప్రతినిధులు, సభ్యులు దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వంలో కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 24 ప్రభాతవార్త : గడప గపడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌లు కూడా పాల్గొన్నాలని వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగానే బుధవారం తిరుపతి నియోజక వర్గ పరిధిలో ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, మేయర్ శిరీషాలతో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అందుతుండడంతో ప్రజలందరూ చాలా సంతోషంగా ఉన్నారని కలెక్టర్ తెలిపారు. విద్యుత్, నీటి సరఫరా వంటి ఇతర సమస్యలను కూడా ప్రజలు మా దృష్టికి తీసుకుని రావడం జరిగిందని తెలిపారు. అన్ని సమస్యలను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించి, వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ లక్ష్యాలు నెరవేరుతాయని పేర్కొన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో రూ. 20లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ, మార్గదర్శకాలు విడుదల చేశానన్నారు. ఇది వరకే గడప, గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలు గుర్తించిన అంశాలకు ప్రాధాన్యత నిస్తూ, ఈ నెలాఖరులోపు ఆయా పనులకు అంచనాలు వేయడం జరుగుతుంది, మరో ఆరు నెలలు లోపు వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడం జరుగుతుందని చెప్పారు. మరో వైపు అత్యధిక ప్రాధాన్యత కలిగిన మిగిలిన పనులను కూడా గుర్తించి ఏడాది, ఏడాదిన్నర లోపు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## పరిశుభ్ర గ్రామాలు ఏర్పాటుకు కంకణం: కలెక్టర్

చిత్తూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త: జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడానికి కంకణం కట్టుకొని అధికారులు విధులు నిర్వర్తించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్ నుండి బుధవారం కలెక్టర్ హరినారాయణన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 697 గ్రామ పంచాయతీల పరిధిలో 580 ఎస్‌డబ్ల్యుపిసి షెడ్యూల్ వున్నాయని ఇందులో 382 మాత్రమే పని చేస్తున్నాయన్నారు. మిగిలిన వాటిని సత్వరం అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. క్లాప్ మిత్రల ద్వారా చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలని సేకరణ చేసిన చెత్తను ఎస్‌డబ్ల్యుపిసి షెడ్లకు పంపి సంపదను సృష్టించాలన్నారు. మేజర్ పంచాయతీల్లో ఇప్పటికే స్వచ్ఛ సంకల్పం పనులు పక్కాగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంను మరో 149 పంచాయతీలకు విస్తరించాలన్నారు. మిగిలిన పంచాయతీల్లో సైతం పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి వ్యాధులు వ్యాప్తి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వాటర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, మండలాల నుండి ఇఒపిఆర్డీలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి కృషి :మంత్రి

పుత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త: పుత్తూరు శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ సదాశివేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి పాలకమండలి సమిష్టిగా ఉంటూ కృషి చేయాలని ఆలయ ప్రాశస్త్యాన్ని ప్రాముఖ్యతను కాపాడుకోవాలని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రోజా ఆకాంక్షించారు. బుధవారం దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం సందర్భంగా మొదటగా పుత్తూరులోని శ్రీనివాస థియేటర్ నుంచి ర్యాలీగా ఆలయం వరకు చేరుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకమండలి చైర్మన్‌గా కొడగంటి రమేష్‌బాబు, సభ్యులుగా జి.రమేష్, ఎం.ఆర్.సుందరం, ఓ.బాబు, జి.రుక్మిణి, విజయలక్ష్మమ్మ, భరణిలు, ఎస్ ఆఫిసియో సభ్యులుగా మురళి గురుకుల్, ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తూమంత్రిగా తనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. శివుని ఆశీస్సులు అందరికి ఉండాలని భగవంతుడి ఆశీస్సులతోనే మనం ఎంత దూరమైనా అభివృద్ధికి చేరుకోగలమన్నారు. కరోనా కష్ట కాలంలోను ఆలయంలో ప్రజలందరూ కరోనా నుంచి కాపాడాలని, పూజలు, హోమాలు చేయించడం జరిగిందన్నారు. అనంతరం నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన ఆలయ చైర్మన్ కమిటీ సభ్యులు మంత్రి రోజాను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మంత్రి రోజా సోదరులు కుమారస్వామిరెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి, ఎంపీపీ మునివేలు, వైస్ చైర్మన్‌లు జయప్రకాష్, శంకర్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, రాష్ట్ర డైరెక్టర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు ఘనస్వాగతం

గుడుపల్లె, ఆగస్టు 24 ప్రభాతవార్త : కుప్పంలో మూడు రోజుల పర్యటనకు విచ్చేసిన ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. బెంగళూరు నుంచి రోడ్డుమార్గంలో తొలుత కర్ణాటకలోని కొల్లుపల్లికి చేరుకుని అక్కడ మాజీ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లారు. అనంతరం అక్కడ నుంచి రామకుప్పం మండలం కొంగనపల్లికి చేరుకోగా కార్యకర్తలు, నేతలు సరిహద్దుల్లో ఘనస్వాగతం పలికారు. కాగా చంద్రబాబు పర్యటన షెడ్యూల్ సమయం కంటే ఆలస్యంగా సాగింది. అయితే ప్రజలు చంద్రబాబును చూసేందుకు వర్షంలో సైతం వేచి చూశారు.

## కామాక్షమ్మకు బంగారు నేత్రాలు బహుకరణ



బంగారుపాళ్యం, ఆగస్టు 24 ప్రభాతవార్త: స్వయంభూ శ్రీ మెగిలీశ్వర సమేత కామాక్షమ్మకు బంగారు నేత్రాలను దాతలు బహుకరించారు. చిత్తూరుకు చెందిన పరమకుమారి, శిశిర్ పరమలు 50 వేల రూపాయల విలువ చేసే బంగారు నేత్రాలను అమ్మవారికి అందజేశారు. ఈ బంగారు నేత్రాలను ఆలయ ఇఓ మునిరాజుకు అందజేశారు. అంతకు ముందు స్వామి, అమ్మ వార్లకు అభిషేక పూజలను వీరు నిర్వహించారు. నేత్రాలు అందజేసిన దాతలకు ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు లలిత, సుజాత, మంజుల, శేఖర్‌బాబు, ఆనందబాబు, బాబలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట, ఆగస్టు 24 ప్రభాతవార్త : ప్రకాశం జిల్లా చీమకుర్తిలో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కలిశారు. ముఖ్యమంత్రి పుష్పగుచ్ఛం అందజేసి కాసేపు మాట్లాడారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## రెజ్లింగ్‌లో ప్రియదర్శినికి బంగారు పతకం

### - మన్సూర్ ఆలంకు కాంస్యం



వడమాలపేట, ఆగస్టు 24 ప్రభాతవార్త: జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట హైస్కూలు విద్యార్థులు ప్రియదర్శిని బంగారు పతకం, మన్సూర్ ఆలం కాంస్యం పతకం సాధించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హల్ద్వాని పట్టణంలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన పోటీల్లో వడమాలపేట హైస్కూలుకు చెందిన ఆరు మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రియదర్శిని 27 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించగా 55 కేజీల విభాగంలో మన్సూర్ ఆలం కాంస్య పతకం గెలుచుకున్నారు. వీరిని అభినం దిస్తూ ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి ప్రియదర్శినికి రెండు వేలు, మన్సూర్ ఆలంకు 6000 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ధనంజయలు ప్రియదర్శినికి వెయ్యి రూపాయలు ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. జాతీయ స్థాయిలో పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చిన పీడీ చంద్రశేఖర్‌రాజును విద్యా కమిటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

## గంగమ్మతల్లి చల్లగా దీవించమ్మా...



పుత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలో గ్రామ దేవత గంగజాతర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు పసుపు, కుంకుమ సమర్పించారు. గంగమ్మతల్లి అందరిని చల్లగా దీవించమ్మా అని ప్రార్థించారు. ముందుగా శివాలయం నుంచి మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా గంగమ్మ దేవాలయానికి చేరుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆలయ గంగజాతర కమిటీ వారు మంత్రి రోజాకు పూలమాలలు వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి వ్రేజిలింగ్‌లో రాణించిన చిన్నారి భావన

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 24 ప్రభాతవార్త : ఉత్తరాఖండ్ జాతీయ స్థాయి వ్రేజిలింగ్ పోటీల్లో రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న చిన్నారి భావన రాణించారు. రాష్ట్ర స్థాయిలో బంగార పతకం, జాతీయ స్థాయిలో వెండి పతకం సాధించడం పట్ల ప్రధానోపాధ్యాయురాలు ఈజీ విష్ణువర్ధనం,ఫిజికల్ డైరెక్టర్ రేఖారాణి, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విజయ్, రజిని చిన్నారిని అభినందించి ఆశీస్సులు అందజేశారు చేశారు.

## పిళ్లారిపట్టు ఉన్నత పాఠశాలలో నాడు -నేడు పనులకు మంత్రి శంకుస్థాపన

పుత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త: పుత్తూరు గ్రామీణ మండలం పిళ్లారిపట్టు ఉన్నత పాఠశాలలో మనబడి నాడు-నేడు పనులకు బుధవారం మంత్రి రోజా శంకుస్థాపన చేశారు. పిళ్లారిపట్టు ఉన్నత పాఠశాలలో మనబడి నాడు-నేడు పథకం కింద 65 లక్షల రూపాయలతో మంజూరైన అదనపు తరగతి గదులను రాష్ట్ర మంత్రి రోజా భూమిపూజ నిర్వహించి మనబడి నాడు-నేడు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బోర్డు మెంబర్లు, డైరెక్టర్‌లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రేణిగుంట జాతీయ స్థాయి పతకాలు

### క్రీడాకారులను అభినందిస్తున్న క్రీడాభిమానులు




రేణిగుంట, ఆగస్టు 24 ప్రభాతవార్త: రేణిగుంట బాలికల ఉన్నత పాఠశాల, సాయి ఇంగ్లీష్ మీడియం స్కూలు విద్యార్థులు జాతీయ రెజ్లింగ్(కుస్తీ) పోటీల్లో పతకాల పంట పండించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగిన ఈ పోటీల్లో వారు అత్యంత ప్రతిభ కనబరచి వివిధ రకాల ఏడు పతకాలను సాధించి రేణిగుంట ప్రతిష్టను జాతీయ స్థాయిలో పెంపొందించారు. వీరిని పలువురు అభినందిస్తున్నారు. వీరంతా రేణిగుంట బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధిని, పీడీ రేఖారాణి ప్రోత్సాహంతో ఉత్తరాఖండ్‌లో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరచారు. సాయి ఇంగ్లీష్ మీడియంకు చెందిన నవ్య బంగారు పతకం కైవసం చేసుకుంది. బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన సంజన, రోజా, భావన వెండి పథకాలు, భార్గవి, ఉషశ్రీ, రాజేశ్వరి, కాంస్య పథకాలను చేజిక్కించుకున్నారు. వీరిపై అటు సాయి ఇంగ్లీష్ మీడియం స్కూలు అధ్యాపకులు, ఇటు బాలికల ఉన్నత పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు వర్షం కురిపించారు.

## చంద్రగిరి చేరుకున్న టిడిపి నాయకుల మృతదేహాలు

### కంటతడి పెట్టిస్తున్న భార్య పిల్లల రోధన-మృతదేహాలను తీసుకొచ్చిన పులివర్తి నాని



చంద్రగిరి, ఆగస్టు 24 ప్రభాతవార్త: ఒంగోలు వద్ద రోడ్డు ప్రమాదంలో అకాల మరణం పొందిన టిడిపి నాయకుల మృతదేహాలను టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని బుధవారం చంద్రగిరికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా అభిమానులు, స్నేహితులు, పట్టణ ప్రజలు బోరున విలపిస్తుండగా, గంగపల్లి భాస్కర్ భార్య పిల్లల రోధన చూపరులను కంటతడిపెట్టిస్తున్నది. పిల్లలు తమ తండ్రి ఇకలేరనే విషయం గ్రహించి చలించిపోయారు. భానుప్రకాష్ రెడ్డి (బన్నీ) మృతదేహాన్ని చూసిన తల్లిని ఓదార్చడం కష్టతరమవుతున్నది. వీరి మృతితో పార్టీలో తీవ్ర విషాధం నెలకొన్నది. గురువారం ఉదయం 8 గంటలకు వీరికి అంత్యక్రియలు చంద్రగిరిలో నిర్వహించన్నుట్లు పార్టీ వర్గాలు వెళ్ళడించాయి.

## శివయ్య సన్నిధిలో కేంద్రకార్మికశాఖ మంత్రి



శ్రీకాళహస్తి, ఆగస్టు 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి బుధవారం కేంద్ర కార్మిక, ఉపాధి అవకాశాలశాఖ మంత్రి పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పులశాఖ మంత్రి భూపేంద్రయాదవ్ విచ్చేశారు. వీరికి బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా.ఆనంద్‌కుమార్ ఆలయ అతిధిగృహం వద్ద నియోజకవర్గ నాయకులతో కలసి ఘనస్వాగతం పలికారు. ఆలయంలో మహిమాన్వితంగా నిర్వహించే ప్రత్యేకరాహుకేతు పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకుని ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. దక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆయనకు స్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని అందించి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందించారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో బిజెపి నాయకులు కిషోర్, గరికపాటిరమేష్‌బాబు, ఎం.సుబ్రమణ్యంరెడ్డి, వెంకటేశ్వర్లు, గోపాల్, రాజ, గోపాల్, హరి, నాని, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## విశేషాలంకరణలో చక్రేశ్వరస్వామి



శ్రీకాళహస్తి, ఆగస్టు 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా జెట్టిపాళెంలో వెలసి ఉన్న శ్రీచక్రేశ్వం స్వామి దేవస్థానంలో బుధవారం త్రయోదశి సందర్భంగా ప్రదోష కాలంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేపట్టారు. ప్రదోషకాలంలో స్వామివారికి అభిషేక సమయంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేపట్టారు. ఆలయ అర్చకులు పరమేశ్వరయ్య ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు నిర్వహించారు.

## కాళంగి రిజర్వాయర్ నీరు తగ్గేంత వరకు ఊరులోనే

కేవీబీ పురం, ఆగస్టు 24 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలం అంజూరుపాళెంలో జయలక్ష్మీపురం గ్రామంలో 120 కుటుంబాలు ఉన్నాయి. అందులో ఎస్టీ కులాలు కూడా ఉన్నారు. కానీ వర్షాకాలంలో కాలింగ రిజర్వాయర్ నిండి ఏరు పారుతుండడంతో అప్పుడు మా గ్రామ ప్రజలు ఏరు దాటి రాలేని పరిస్థితి నెలకొంది.దీంతో ఆ నీరు మూడు నెలల తరువాత నీరు తగ్గితే బయటకు రాగలమని ఆ కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఆ నీరు తగ్గేంత వరకు ఊరులోనే కష్టాలు పడుతూ బతకాలన్నారు. స్కూలు పిల్లలు, రైతులు కూలీలు, దుకాణాలకు వెళ్ళలేక పోతున్నామని వారు వాపోతున్నారు. రాజులు మారిన రాజ్యాలు మారని మా బతుకులు మారలేదని, ఏ ప్రభుత్వం మారినా మా వైపు చూసిన వారు లేరని, ఓట్లుకి మాత్రం తప్పకుండా వస్తారని, కల్లబొల్లి మాటలతో కమనీయంగా చెప్పి చల్లగా జారుకుంటారని తెలిపారు. వైసీపీ పార్టీ తిరుపతి ఎంపీ గురుమూర్తి, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, మండలం నాయకులు గవర్ల కృష్ణయ్య, నందకుమార్, లాల్‌బబు, చిరంజీవి, బుర్ర మాధవరెడ్డి, హరిబాబులు మాట ఇచ్చారు. కానీ మూడు సంవత్సరాలు అవుతున్నా ఆ రిజర్వాయర్ వైపు చూడలేదని తెలిపారు.